RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in




హైదరాబాద్ 29 జూలై 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:52

## హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు.. ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం**

**హైడ్రా అనేది ప్రభుత్వం తెచ్చిన అతిపెద్ద సంస్కరణ అని వెల్లడి**

**ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.



మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

"బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా? ఒక బీఆర్ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

## పీఎంఏవై జీ కింద రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

**కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

న్యూ ఢిల్లీ తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.



ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలువురు ఎంపీలతో కలిసి కృషి భవన్ లో కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం ఖఓంజ–ఉ ను వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గత పదేళ్లు పేదలు సొంత ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని తెలిపారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఎల్నినో, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)లో (వీబీ జీ రామ్ జీ) అదనపు పనులను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపాధులు మెరుగుపర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహానికి అదనపు పనులను చట్టంలో చేర్చాలని కోరారు. రైతులు తమ భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయల తోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకు కందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు వీబీ జీ రామ్ జీలో చేపట్టాలని కోరారు.

ఉపాధి హామీ పథకం (ఓఉఔఖీఇఊ) కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో 90 రోజుల వరకు పనులు చేసే అవకాశం ఉండేదని ముఖ్యమంత్రి గారు గుర్తుచేశారు. వీబీ జీ రామ్ జీ లోనూ అందుకు అనుమతి ఇప్పించాలని కోరారు. స్థానిక అవసరాలకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే ఇతర పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలన్నారు.

ముఖ్యమంత్రి వెంట ఎంపీలు ఎం అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి , పోరిక బలరాం నాయక్, , సురేష్ షేట్కార్ , చామల కిరణ్ కుమార్ రెడ్డి, , రామసహాయం రఘురాం రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ , ఎక్స్-అఫీషియో స్పెషల్ సెక్రటరీ రామకృష్ణారావు , సెక్రటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ కుమార్ వున్నారు.

## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం


**ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి**

**రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**నిర్ధేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి**

**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు.

రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు.

రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికతతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు.

రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు.

మిగతా 2 లో



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** మాజీ కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు కాంగ్రెస్ నాయకులు కుమార్ రావ్, సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్ తదితరులు

## కామన్‌వెల్త్ గేమ్స్ భారత్ ఖాతాలో మరో మూడు పతకాలు



కామన్‌వెల్త్ గేమ్స్‌భారత్ ఖాతాలో మరో మూడు పతకాలుకామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్ సత్తా చాటుతోంది. తాజాగా పారా షాట్‌పుట్ ఈ57 విభాగంలో షర్మిలా ధన్‌కర్ స్వర్ణం సాధించారు. దీంతో భారత్ ఖాతాలో రెండో గోల్డ్ మెడల్ చేరింది. మెన్స్ హైజంప్‌లో సర్వేశ్ కుషారే సిల్వర్ గెలిచి, కామన్‌వెల్త్ హైజంప్‌లో పతకం నెగ్గిన తొలి ఇండియన్‌గా చరిత్ర సృష్టించారు.అటు వెయిట్‌లిఫ్టింగ్ 79ఐఉ విభాగంలోనూ వల్లూరి అజయ్ సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు.దీంతో టోటల్‌గా భారత్‌కు 2 గోల్డ్, 5 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ వచ్చాయి.

ప్రజాబలం

29 జూలై 2026 బుధవారం

## విద్యామంత్రులకు ఏమౌతోంది....

విద్యార్థుల నిరసనల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. దీంతో ఆయన మోదీ ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖలో గడువు ముగియక ముందే బాధ్యతల నుంచి తప్పుకున్న మంత్రుల జాబితాలో చేరిపోయారుభారత విద్యా వ్యవస్థపై జంతర్ మంతర్ వద్ద మొదలైన ప్రశ్నలు, వారం రోజుల్లోనే దేశవ్యాప్త యువజన ఆందోళనగా మారాయి. కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్లను ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమ ముగింపును ప్రకటించారు. అయితే, ఈ ఉద్యమం భారత విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ తీరు, ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఒక కొత్త చర్చకు తెరలేపింది. ఇప్పుడు ప్రశ్నలు కేవలం ప్రస్తుత విద్యాశాఖ మంత్రిపైనే కాకుండా, మోదీ ప్రభుత్వ హయాంలో విద్యా మంత్రిత్వ శాఖ నడిచిన మొత్తం దిశపైనే వ్యక్తమవుతున్నాయి. 2014 నుంచి ఇప్పటివరకు స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్, రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్', ధర్మేంద్ర ప్రధాన్ నాయకత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ సరికొత్త విద్యా విధానాన్ని, సంస్థాగత మార్పులను, భావజాలపరమైన ఎన్నో చర్చలను చూసింది. ఈ సంవత్సరాలలో విద్యా వ్యవస్థను మెరుగుపరచడం కంటే భావజాల మార్పులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శకులు ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం దీనిని ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాత్మక సంస్కరణల ప్రక్రియగా పేర్కొంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో, మోదీ హయాంలోని నలుగురు విద్యాశాఖ మంత్రుల పాత్రను ఏ కోణంలో చూడాలనే ప్రశ్నను ప్రస్తుత వివాదం మరోసారి తెరపైకి తెచ్చింది. 12 ఏళ్ల మోదీ ప్రభుత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ మాత్రమే నలుగురు వేర్వేరు మంత్రుల మారిన ఏకైక కీలక శాఖగా నిలిచింది. అదే సమయంలో హోం, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, రక్షణ, ఆరోగ్య వంటి మంత్రిత్వ శాఖలలో మాత్రం దాదాపు స్థిరత్వం కొనసాగింది. ముఖ్యమైన విషయమేమిటంటే, ఈ ముగ్గురు మాజీ విద్యాశాఖ మంత్రులు పదవుల నుంచి తప్పుకున్న కొద్ది సంవత్సరాలకే వివిధ కారణాల వల్ల కేంద్ర క్యాబినెట్ నుంచి కూడా పూర్తిగా కనుమరుగయ్యారు. సమాచార-ప్రసార శాఖలో గత 12 ఏళ్ల వ్యవధిలో ఏడుగురు కేంద్ర మంత్రులు, సంస్కృతి మంత్రిత్వ శాఖలో ఐదుగురు కేంద్ర మంత్రులు మారారు. మోదీ ప్రభుత్వ మొదటి విడత పదవీకాలంలో స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్ మానవ వనరుల వికాస మంత్రిత్వ శాఖ బాధ్యతలను నిర్వహించారు. మోదీ 2.0 హయాంలో ఈ బాధ్యత రమేశ్ పోఖ్రియాల్ నిశంక్‌కు దక్కింది. అయితే, 2021లో జరిగిన క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమించారు. ఆయన రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులు నెల రోజుల పాటు జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కూర్చున్నారు, చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ ఒత్తిడికి తలొగ్గింది. పార్లమెంటులో నీట్ లీక్ వ్యవహారంపై చర్చ జరపడానికి మోదీ ప్రభుత్వం అంగీకరించింది, కానీ, రాజీనామా డిమాండ్‌ను చర్చకు షరతుగా పెట్టవద్దని ప్రతిపక్షాలకు కోరుతూ వచ్చింది. నీట్ పరీక్ష లీక్ కేసును పక్కన పెడితే, సంఘ్‌కు సంబంధించిన అన్ని ప్రధాన లక్ష్యాలను ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి హడావుడి లేకుండా అమలు చేయడంలో విజయం సాధించారు.. 2014లో ఏర్పాటైన మొదటి మోదీ క్యాబినెట్‌లో ధర్మేంద్ర ప్రధాన్‌ను పెట్రోలియం శాఖ మంత్రిగా నియమించారు. ఆ తర్వాత మోదీ 2.0లో ఆయన విద్యాశాఖ మంత్రి అయ్యారు, మోదీ 3.0 పదవీకాలంలోనూ ఆ బాధ్యతల్లోనే కొనసాగారు. ఆయన పదవీకాలంలో జాతీయ విద్యా విధానానికి ఊతం లభించింది. మాతృభాష, పలు భాషల్లో విద్యను ఆయన ప్రోత్సహించారు. కానీ, త్రిభాషా సూత్రంపై తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో సుదీర్ఘకాలం పాటు వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచారు.. రాజకీయ జోక్యం, 'హిందీ రుద్దడం' లాంటి ఆరోపణలను ప్రత్యర్థులు ఆయనపై గుప్పించారు, దీనివల్ల విద్యా విధానం కేంద్రం వర్సెస్ రాష్ట్రాల వివాదంగా మారింది. మోదీ పాలనలో విద్యాశాఖలో అవలంబించిన విధానాలన్నీ వామపక్ష భావజాలాన్ని తొలగించే లక్ష్యంతోనే అమలయ్యాయని శరద్ గుప్తా పేర్కొన్నారు. భారత విద్యా వ్యవస్థ నుంచి వామపక్ష విద్యా విధానాన్ని తొలగించడమే సంఘ్ ప్రధాన లక్ష్యం.. 2014లో స్మృతి ఇరానీని మానవ వనరుల అభివృద్ధి(హెచ్ఆర్డీ) మంత్రిగా నియమించినప్పుడు, ఆమె రాహుల్ గాంధీ చేతిలో ఓడిపోయిన తర్వాత క్యాబినెట్‌లో భాగమయ్యారు. మోదీ రెండవ విడత పదవీకాలంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేరును మార్చారు. జాతీయ విద్యా విధానంలోని ప్రధాన సిఫార్సులలో భాగంగా 'విద్యపై మరింత దృష్టి పెట్టడానికి' కేంద్ర ప్రభుత్వం ఈ మార్పు చేసింది. 1985 కంటే ముందు ఈ శాఖను 'విద్యా మంత్రిత్వ శాఖ' అనే పిలిచేవారు. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పాలనలో దీని పేరును మార్చారు. అప్పట్లో 'విద్యను మరింత విస్తృత కోణంలో చూడటం' దీని వెనుక ఉన్న ఉద్దేశంగా చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం, స్మృతి ఇరానీ చదువు 12వ తరగతి వరకే సాగింది. దీనిని కాంగ్రెస్ ఒక పెద్ద అంశంగా మార్చింది. అయితే, ఆమె పార్లమెంటులో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తన వాదనను చాలా స్పష్టంగా, బలంగా వినిపిస్తారని చెబుతూ బీజేపీ ఈ విమర్శలను తోసిపుచ్చింది. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాతే నూతన విద్యా విధానంపై కసరత్తు మొదలైంది. మంత్రిత్వ శాఖలో స్మృతి ఇరానీ పదవీకాలంలో నూతన విద్యా విధానానికి సంబంధించిన పనులు ప్రారంభం కాగా, మోదీ హయాంలోని మూడవ విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్' సమయంలో దీనిని అమలు చేశారు. భారతదేశంలో నూతన విద్యా విధానం 34 సంవత్సరాల తర్వాత 2020లో అమల్లోకి వచ్చింది. దీనిని మోదీ పదవీకాలంలో ఒక పెద్ద అడుగుగా భావిస్తారు. నూతన విద్యా విధానంలో విద్యా బడ్జెట్‌ను జీడీపీలో ఆరు శాతంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నలుగురు విద్యాశాఖ మంత్రుల హయాంలో దాదాపు ప్రతి విశ్వవిద్యాలయంలోనూ అధ్యాపకుల ఎంపికలో భావజాలానికే పెద్దపీట వేశారు. ఈ విధంగా భవిష్యత్తులో ప్రభుత్వం మారినప్పటికీ, కనీసం రెండు తరాల పాటు విద్యా సంస్థలపై సంఘ్ తన ప్రభావాన్ని నిలుపుకోగలుగుతుంది" అన్నారు. వామపక్షాల పట్టుగా భావించే జేఎన్‌యూలో 2022లో శాంతిశ్రీ ధూళిపూడి పండిట్‌ను వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. ఈ విశ్వవిద్యాలయ చరిత్రలోనే తొలి మహిళా వైస్ ఛాన్సలర్‌గా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో తనకున్న అనుబంధాన్ని బహిరంగంగా అంగీకరించిన వ్యక్తిగా ఆమె గుర్తింపు పొందారు. అశాస్త్రీయ ప్రకటనల వల్ల రమేశ్ పోఖ్రియాల్ వివాదాల్లో చిక్కుకున్నారు. 'చరక మహర్షి అణు-పరమాణువులను కనుగొన్నారు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. కోవిడ్ సమయంలో జేఈఈ-నీట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించిన తర్వాత ఆయనపై ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీనికి వ్యతిరేకంగా పౌరులు కోర్టుకు కూడా వెళ్లారు, అక్కడ తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చింది. అయితే, అప్పట్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు, ఇది వివాదాస్పదమైంది. కోవిడ్ బారిన పడిన తర్వాత, అనారోగ్య కారణాల వల్ల రమేశ్ పోఖ్రియాల్ తన పదవికి రాజీనామా చేశారని అంటారు. కానీ, ఆ తర్వాత ఆయన మోదీ క్యాబినెట్ నుంచి పూర్తిగా తప్పుకున్నారు. ఆ స్థానంలో ధర్మేంద్ర ప్రధాన్ 2021 నుంచి జూలై 2026 వరకు ఈ బాధ్యతలను నిర్వహించారు.

## ఇక మార్కెట్లో కొత్త నోట్లు చిరగవు, తడవవు కేంద్రం: గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ పాలిమర్ నోట్ల ప్రవేశం డిజిటల్ చెల్లింపులపై ఏదైనా ప్రభావం చూపుతుందా లేదా అని చెప్పడం తొందరపాటు అవుతుందని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. ఈ నోట్లు క్రమం తప్పకుండా చలామణిలోకి వచ్చిన తర్వాతే దీనిపై సరైన అంచనా వేయడం సాధ్యమవుతుంది. నగదు, డిజిటల్ చెల్లింపులు ఒకదానికొకటి పూరకంగా ఉంటాయని, భవిష్యత్తులోనూ కలిసి కొనసాగుతాయని కేంద్ర బ్యాంకు విశ్వసిస్తోంది. ప్లాస్టిక్‌ను పోలి ఉండే పాలిమర్ కరెన్సీ నోట్లు త్వరలో భారతదేశంలో చలామణిలోకి రావచ్చు.. క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం రూ.10, రూ.20 డినామినేషన్లలో 10 కోట్ల పాలిమర్ కరెన్సీ నోట్లను జారీ చేయాలన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. భారతదేశంలో పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టే దిశగా ఇది మొదటి ప్రధాన అడుగుగా పరిగణించవచ్చు.. లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్‌బిఐ ప్రారంభంలో ఈ నోట్లను పరిమిత స్థాయిలో జారీ చేస్తుందని తెలిపారు. భారతదేశంలోని విభిన్న వాతావరణ, వినియోగ పరిస్థితులలో వాటి మన్నికను, వినియోగాన్ని పరీక్షించడమే ఈ ప్రయోగం ఉద్దేశ్యం. ఈ ప్రయోగం విజయవంతమైతేనే, వాటిని భారీస్థాయిలో జారీ చేసే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. పాలిమర్ నోట్లు ఎందుకు ప్రత్యేకమైనవి:సాధారణ కాగితపు నోట్ల కంటే పాలిమర్ నోట్లు బలంగా,ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని ఆర్‌బిఐ భావిస్తోంది. అవి అంత సులభంగా చిరగవు, అలాగే నీరు, మురికి పట్టవు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో పాలిమర్ నోట్లు ఇప్పటికే వాడుకలో ఉన్నాయి. సాంప్రదాయ నోట్ల కంటే వీటి మన్నిక ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది ఆర్బీఐ. అందువల్ల నగదు ఇప్పటికీ విస్తృతంగా వాడుకలో ఉన్న భారతదేశం వంటి దేశాలలో ఈ నోట్లు మరింత ప్రభావవంతంగా నిరూపించుకోగలవు. కాగితపు నోట్లను నిలిపివేస్తారా?ప్రభుత్వం ఈ విషయంపై ఉన్న ఆందోళనలను తోసిపుచ్చింది. ప్రస్తుతానికి కాగితపు కరెన్సీని నిలిపివేసే ప్రతిపాదన ఏదీ లేదని ఆర్థిక శాఖ సహాయ మంత్రి స్పష్టంగా తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీతో పాటు పాలిమర్ నోట్లు కూడా చలామణిలో కొనసాగుతాయి. దీని అర్థం ప్రజలు తమ వద్ద ఉన్న కాగితపు కరెన్సీని మార్చుకోవాల్సిన అవసరం ఉండదు. డిజిటల్ చెల్లింపులపై తక్షణ ప్రభావం ఉండదు:పాలిమర్ నోట్ల ప్రవేశం డిజిటల్ చెల్లింపులపై ఏదైనా ప్రభావం చూపుతుందా లేదా అని చెప్పడం తొందరపాటు అవుతుందని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. ఈ నోట్లు క్రమం తప్పకుండా చలామణిలోకి వచ్చిన తర్వాతే దీనిపై సరైన అంచనా వేయడం సాధ్యమవుతుంది. నగదు, డిజిటల్ చెల్లింపులు ఒకదానికొకటి పూరకంగా ఉంటాయని, భవిష్యత్తులోనూ కలిసి కొనసాగుతాయని కేంద్ర బ్యాంకు విశ్వసిస్తోంది.

క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే, రాబోయే సంవత్సరాల్లో భారతీయులు తమ పర్సులలో సాంప్రదాయ కాగితపు నోట్లతో పాటు కొత్త పాలిమర్ నోట్లను కూడా చూడవచ్చు. దీనివల్ల నోట్ల మన్నిక పెరిగి, తరచుగా మార్చుకోవాల్సిన అవసరం తగ్గుతుంది.

## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

## మన్ననూరు హాస్టల్ ను తనిఖీ చేసిన మంత్రి అడ్లూరి

నాగర్ కర్నూలు మన్ననూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మంత్రి వెంట అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తదితరులున్నారు. విద్యా ప్రమాణాలు, హాస్టల్ వసతి, భోజన నాణ్యతపై మంత్రి క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీసారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. వంటగది, భోజనశాల, హాస్టల్ గదులు, తరగతి గదులు, మరుగుదొడ్ల పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలి. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం, సురక్షిత వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి అన్నారు.

# ప్రశ్న పత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

**చర్యలు తీసుకోకపోవడం వల్లనే సీబీఎస్ఈకీ విస్తరించిన గ్లోబరీనా అక్రమాలు**

**కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు**

**హైడ్రా పనులు భవిష్యత్‌లోనూ కొనసాగిస్తుంది...**

**ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

ఢిల్లీ: ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలో దేశస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నాపత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేది చూస్తామని సీఎం ఒక ప్రశ్నకు బదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనా వటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించి, వాటిని గందరగోళం చేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్నవాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు.

కూటమి ప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్నట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమం తప్పకుండా వాటిని చెల్లించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.

చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పార్క్‌లను కబ్జాలు పెట్టుకున్నోళ్లు కోర్టులను తప్పుదోవ పట్టించి కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద అధికారులను మార్చాలనే నిబంధన ఉంటే, గతంలో సోమేశ్‌కుమార్ మీద 400 కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులున్నాయని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వం విచక్షణాధికారమని, దానిని ఎవరూ గుంజుకోలేరని సీఎం స్పష్టం చేశారు. న్యాయస్థానాల మీద తనకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని సీఎం తెలిపారు. హైడ్రా మంచి పనులు చేస్తోందని, తమ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రేటెస్ట్ రిఫార్మ్ హైడ్రా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైడ్రా అత్యుత్తమ సంస్థల్లో ఒకటని, ప్రభుత్వ పార్కులు, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా విధి అని, ఆ పనిని హైడ్రా పకడ్బందీగా చేస్తోందని సీఎం తెలిపారు.

బతుకమ్మ కుంటలాంటి దానిని బీఆర్ఎస్‌వాళు కబ్జా పెట్టుకున్నారని, దానినిపై కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసు వేశారని సీఎం విమర్శించారు. ఆ కుంట పేరే బతుకమ్మ కుంట అని, దానిపై కేసు నడుస్తోందని, వాటిని ఏవిధంగా చూడాలని సీఎం ప్రశ్నించారు. హైడ్రాని పనిచేయకుండా అడ్డుకోవాలనే కబ్జాకోరులకు సహకరించవద్దని మీడియాకు సీఎం విజ్ఞప్తి చేశారు. హైడ్రా ఎన్ కన్వేన్షన్ కూలగొట్టింది.. అది పేదోళ్లదా? గండిపేట చెరువులో ఆక్రమణలు కూలగొట్టింది... అవి పేదోళ్లవా? బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్నోళ్లు పేదోళ్లా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కబ్జాదారులను కాపాడటానికి డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హైడ్రా కారాచరణపైనా, హైడ్రా నిర్వహిస్తున్న బాధ్యతలపైనా ప్రభుత్వానికి స్పష్టత ఉందని సీఎం తెలిపారు.

# యనగండ్లలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం.

**ప్రజలను నేరుగా కలుసుకున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి..**
**సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ**
**కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన..**
**గ్రామాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం**

సి.బెలగల్, జూలై 28 రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చేరవేసి, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం సోమవారం సి.బెలగల్ మండలం గొల్లల దొడ్డి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి పాల్గొని గ్రామంలోని ప్రతి వీధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.గ్రామంలో అడుగడుగునా ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజల స్పందనను స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు, భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.గ్రామస్తులు తమ ప్రాంతంలో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య, అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, పింఛన్ల మంజూరు, గృహ నిర్మాణాలు, సంక్షేమ పథకాల అర్హతలు, రైతులకు సాగునీటి సౌకర్యం వంటి అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రతి సమస్యను ఎమ్మెల్యే శ్రద్ధగా విని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా నాయకులను, అధికారులను సంప్రదించాలని, ఎవరూ మధ్యవర్తులను నమ్మవద్దని సూచించారు."ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడం, ప్రజలతో ప్రత్యక్ష అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. గ్రామాభివృద్ధి విషయంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రభుత్వం?ప్రజలు కలిసి పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకుడు వి. వెంకట్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు దూదు వలి బూతు ఇన్చార్ .వెంకటేశ్వర రెడ్డిప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, యువత, అభిమానులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగింపు వరకు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనగా, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించారు.

# కాలానికి అనుగుణంగా తీరొక్క కూరగాయల సాగు

**ఎల్ నినో ప్రభావానికి అధిగమించేందుకు మారుపాక రైతు వినూత్న విధానంలో ముందుకు**
**పరిశీలించి అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**30 గుంటల్లో ఆరు రకాల కూరగాయలు సాగు చేస్తున్న రైతు చెరుకు తిరుపతి**



రాజన్న సిరిసిల్ల కాలానికి అనుగుణంగా తీరొక్క కూరగాయలు సాగు చేస్తున్నారు వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన చెరుకు తిరుపతి. ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉండడం, భూ గర్భ జలాలు రానురాను తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు భిన్నంగా నమోదు అవుతున్నాయి.సంప్రదాయ వరి ఇతర పంటలకు సాగు నీరు ఎక్కువ అవసరం అవుతుంది. ఎల్ నినో ప్రభావం తక్కువ వర్షపాతంతో ఇబ్బందులు అధిగమించేందుకు తనకు ఉన్న ఐదు ఎకరాలను బీడుగా వదిలివేయవద్దని, తక్కువ నీటితో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆదాయం పొందాలనే ఉద్దేశంతో వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన చెరుకు తిరుపతి అనే రైతు తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిలో వరికి బదులుగా ఇతర పంటలు సాగు చేస్తానని నిర్ణయించుకున్నారు. దాదాపు 30 గంటల విస్తీర్ణంలో ప్రస్తుతం బీరకాయ, కాకర కాయ, బెండకాయ, గోరు చిక్కుడు, సోర కాయ, మెంతి కూర సాగు చేస్తున్నారు. ఇప్పుడు బీరకాయ పంట చేతికి వచ్చింది. మిగతా భూమిలో వివిధ పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.× వరికి బదులుగా కూరగాయలువేములవాడ అర్బన్ మండలం మారుపాకలో రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆ రైతు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్న విషయం తెలిసి నేరుగా ఆతడి వ్యవసాయ భూమికి వెళ్లారు.ఏ ఏ పంటలు వేస్తున్నారు? ఎంత విస్తీర్ణంలో వేశారు? సాగులో మెలకువలు .. సాగు విధానం తదితర అంశాలపై తిరుపతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కు అనుగుణంగా చెరుకు తిరుపతి కూరగాయలు సాగు చేయడాన్ని చూసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతు సంప్రదాయ పంటలు సాగు చేయకుండా కూరగాయలు సాగు చేస్తున్నారని వివరించారు. వరికి బదులుగా కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందే మార్గాన్ని రైతు అవలంబిస్తున్నారని తెలిపారు. వివిధ రకాల కూరగాయలు సాగు చేయడంతో తనకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని, వాతావరణ ఇబ్బందులు, నీటి సమస్య దూరం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే సేంద్రియ ఎరువులు ఉపయోగించి పంటలు సాగు చేస్తే రైతులకు మరింత ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు.మిగతా రైతులు కూడా తమకు ఉన్న భూమిలో ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందాలని, ప్రస్తుత వాతావరణ ఇబ్బందుల నుంచి బయట పడాలని పిలుపు నిచ్చారు. ఉద్యానవన శాఖ ఇతర శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ ఏడాది రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు సాగాలని పిలుపు నిచ్చారు.పరిశీలనలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ వేములవాడ డివిజన్ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు ఉన్నారు

# ఇక ఫ్యామిలీ రిజిస్టర్ విధానం

వరంగల్ జూలై 28, తెలంగాణ ప్రభుత్వం త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ రిజిస్టర్ విధానాన్ని అమలు చేయనుంది. రేషన్ కార్డు డేటా ఆధారంగా ప్రతి కుటుంబానికి ఒకే అధికారిక కుటుంబ రికార్డు రూపొందించనున్నారు. మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా.. 2 రోజుల్లో దినాల్లో సర్టిఫికెట్ జారీ చేసేలా సర్కార్ చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల కోసం ఒకే కుటుంబ రికార్డును వినియోగించేలా ఈ కొత్త విధానం ఉపయోగపడనుంది.తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు కుటుంబ వివరాల ధ్రువీకరణను ఒకే వేదికపైకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో 'ఫ్యామిలీ రిజిస్టర్' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రతి కుటుంబానికి ఒకే ప్రామాణిక కుటుంబ రికార్డు అందుబాటులోకి రానుంది. రేషన్ కార్డు డేటాను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సభ్యుల వివరాలను ఒకే రిజిస్టర్‌లో నమోదు చేయనుంది.ఆ తర్వాత మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా ప్రజలు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. దరఖాస్తు చేసిన తర్వాత కేవలం రెండు పని దినాల్లోనే సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని తీసుకురావాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం తగ్గనుంది.ఒకే కుటుంబ రికార్డుతో వివిధ ప్రభుత్వ సేవలను పొందే అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు సమయం, శ్రమ ఆదా చేయడంతో పాటు సేవల్లో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం వేర్వేరు ప్రభుత్వ సేవల కోసం వేర్వేరు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి వస్తుండగా.. ఫ్యామిలీ రిజిస్టర్ అమల్లోకి వచ్చిన తర్వాత ఒకే అధికారిక కుటుంబ రికార్డు ఆధారంగా అనేక సేవలు పొందే వీలు కలగనుంది. త్వరలోనే ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.ఈ కొత్త విధానం అమలై ఫ్యామిలీ రిజిస్టర్ అందుబాటులోకి వస్తే ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు, ఇతర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఫ్యామిలీ రిజిస్టర్‌లో కుటుంబ పెద్ద పేరుతోపాటు.. అందరు కుటుంబ సభ్యుల వివరాలు, కుటుంబ పెద్దతో వారి సంబంధం, వయసు, పుట్టిన తేదీ, కుటుంబం పూర్తి నివాస చిరునామా కూడా ఉండనున్నాయి.ఇది ఆస్తిపై ఎలాంటి చట్టపరమైన హక్కును, యాజమాన్యాన్ని కల్పించదని.. చట్టబద్ధమైన వారసత్వానికి రుజువుగా కూడా పరిగణించలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా ఈ ఫ్యామిలీ రిజిస్టర్ ఎవరినీ సంక్షేమ పథకాలకు అర్హులుగా చేయదని స్పష్టం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన ఫార్మాట్‌లో ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం జారీ చేయనుంది.

## శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీలో ఘనంగా ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం..
## - ఉచిత హెపటైటిస్-బి టీకా పంపిణీ..?

రేణిగుంట: ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్యులు మరియు సిబ్బంది కోసం ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం మరియు ఉచిత హెపటైటిస్-బి వ్యాక్సినేషన్ డ్రైవ్ అత్యంత వైభవంగా నిర్వహించబడింది.?ఈ కార్యక్రమానికి కాలేజీ గౌరవనీయ ఉపకులపతి డా. హనుమంత రావు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకలో హెచ్ఆర్ డైరెక్టర్ డా. ఎం. నాగరాజు, జేఈవో డా. ఎం. నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డా. జె. వీరస్వామి అలాగే వివిధ క్లినికల్ విభాగాల అధ్యాపకులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.?ఆరోగ్య అవగాహనే శ్రీరామరక్ష...?ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. హెపటైటిస్ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ముఖ్యంగా వైద్య రంగంలో సేవలందిస్తున్న విద్యార్థులు, వైద్యులు మరియు సిబ్బంది నిరంతరం రోగులతో మమేకమై ఉంటారు కాబట్టి, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత హెపటైటిస్-బి టీకా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.?విజయవంతమైన నిర్వహణ..?ఈ బృహత్ కార్యక్రమాన్ని మైక్రోబయాలజీ విభాగానికి చెందిన డా. ఎం. నాగరాజ, డా. కె.హెచ్. వాసుదేవ నాయుడు ఆధ్వర్యంలో సమర్థవంతంగా రూపకల్పన చేశారు. అసోసియేట్ డీన్ (స్టూడెంట్ అఫైర్స్) డా. సుజాత, పీడియాట్రిక్స్ విభాగం నుంచి డా. మను, మెడిసిన్ విభాగం నుంచి డా. మునీశ్వర రెడ్డి మరియు డా. జయ భాస్కర్ శ్రీబీ ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. వీరికి తోడుగా నర్సింగ్ విభాగం పరిపాలన సిబ్బంది మరియు ఆడియో విజువల్ విభాగాలు సంయుక్తంగా శ్రమించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశాయి. వైద్య విద్యార్థులు ఫ్యాకల్టీ సభ్యులు మరియు సిబ్బంది నుంచి ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. తమ ఆరోగ్యం కోసం ఉచితంగా వ్యాక్సినేషన్ డ్రైవ్ ను ఏర్పాటు చేయడంతో పాటు దీనిని పూర్తిగా స్పాన్సర్ చేసిన చైర్మన్ కి ఈ సందర్భంగా కాలేజ్ యాజమాన్యం అధ్యాపక బృందం మరియు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశా

# పోక్సో నేరాలపై జిల్లా పోలీసుల ఉక్కుపాదం

**పోక్సో నిందుతులకు వరుస కఠిన శిక్షలు**
**పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల శిక్షతో సంచలన తీర్పు**
**జిల్లా ఎస్పీ మహేష్ బి . గితే**

రాజన్న సిరిసిల్ల సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మైనర్ బాలిక పై లైంగిక వేధింపుల (పోక్సో) కేసులో నిందితుడుకి 20 సంవత్సరాలు జైలు శిక్ష, 2000/- రూ. జరిమానా విధిస్తు సిరిసిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్టు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు× కేసు వివరాలు...సిరిసిల్ల కి చెందిన బుర్లా చంద్ర శేఖర్ అనే వ్యక్తి సిరిసిల్ల కి చెందిన ఒక మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురి చేయగా, బాలిక యొక్క తల్లి పిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు.× కోర్టు తీర్పు...కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్ వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు పరిశీలీనీచిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన బుర్లా చంద్ర శేఖర్ కి



20 సంవత్సరాలు జైలు శిక్ష,రూ. 2000 జరిమాన విధించారు. పోక్సో కేసుల్లో జిల్లా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి, ప్రాసిక్యూషన్ సమన్వయంతో వేగవంతమైన విచారణ జరిపిస్తూ నిందితులకు వరుసగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు.నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, కఠిన శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈకేసులో పకడ్బంధిగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన అప్పటి విచారణ అధికారి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి , ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి,ప్రస్తుత సి.ఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్,కోర్టు మానిటరినీగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు,శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ జనార్దన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందిచారు.

# నిన్న కర్నూలు.. ఇవాళ చిత్తూరు
# రాయలసీమలో బంగారు గనులు

తిరుపతి, జూలై 28, కర్నూలు జిల్లా జొన్నగిరిలోని బంగారు గనిలో విజయవంతంగా బంగారం ఉత్పత్తి మొదలైంది. దీంతో రాష్ట్రంలో మరో భారీ బంగారు గని అభివృద్ధికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.. చిత్తూరు జిల్లా చిగురుగుంట-బి. సొనత్తం బంగారు గనులను దక్కించుకునేందుకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఈ-వేలంలో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఈ గనుల్లో సుమారు 22 లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలు ఉన్నట్లు అంచనా. మొత్తం 12,500 కిలోల వరకు బంగారం వెలికితీసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ గనులను నేరుగా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్రాన్ని కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. ఏపీకి ఆర్థికంగా భారీగా స్థాయిలో మేలు జరిగే అవకాశాల ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.చిగురుగుంట-బి సొనత్తంలో 22లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలున్నట్లు అధికారులు గుర్తించారు. టన్ను ఖనిజాన్ని తవ్వితీసి శుద్ధి చేస్తే సగటున 5.64గ్రాముల బంగారం వస్తుందని అంచనా వేశారు. దీంతో ఈ గని నుంచి 12,500 కిలోల బంగారాన్ని వెలికితీయొచ్చునని అధికారులు భావిస్తున్నారు ఇక్కడ గతంలో భారత్ గోల్డ్ మైన్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. 2001 సంవత్సరంలో తవ్వకాలను నిలిపివేశారు. 2018లో నిర్వహించిన ఈ-వేలంలో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ ఎండీసీ) వీటిని దక్కించుకుంది. అయితే, కొన్ని ఇబ్బందల వల్ల లీజును వదలుకుంది. ప్రస్తుతం ఇక్కడి గనులకు టెండర్లు పిలిచారు. దీంతో ఏపీ ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ గనుల లీజును ఏపీఎండీసీ దక్కించుకొని బంగారం వెలికితీయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈనెలాఖరు వరకు బిడ్ల దాఖలుకు అవకాశం ఉండగా.. ఈ-వేలంలో పాల్గొనేందుకు ఏపీఎండీసీ సిద్ధమైంది.బంగారం, బొగ్గు, బాక్సైట్ వంటి మేజర్ మినరల్స్ ను వేలం ద్వారా కేటాయిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైనా వేలంలో పాల్గొని లీజులు పొందాల్సిందే. అయితే, ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని రెండు బొగ్గు బ్లాక్ లకు వేలం లేకుండా సింగరేణికి నేరుగా రిజర్వు చేశారు. ఒడిశాలోనూ ఓ బాక్సైట్ లీజును ఒడిశా ఖనిజాభివృద్ధి సంస్థకు కేటాయించారు. దీంతో చిగురుగుంట -బి సొనత్తం గనులను వేలం లేకుండా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఇక్కడి మైన్స్ ద్వారా ఏపీఎండీసీకి ఆర్థికంగా మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# జెన్ జీ దిశగా జగన్ పార్టీ వ్యూహాలు

విజయవాడ, జూలై 28, జెన్ జీ పోరాటాలతో ప్రధాన్ రాజీనామా చేయడంతో అదే వ్యూహాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పునరావృతం చేసేందుకు ప్రతిపక్ష వైసీపీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఏపీ మెగా డీఎస్సీ నిర్వహణపై గతంలో చేసిన అక్రమాల ఆరోపణలనే మళ్లీ తెరపైకి తెస్తూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను వినిపిస్తోంది. పూర్తి పరీక్ష ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, పేపర్ లీకేజీలు జరిగాయంటూ వైసీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.డీఎస్సీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ వేసిన పిటిషన్లలో న్యాయస్థానానికి కనీస ఆధారాలు కూడా సమర్పించలేక పిటిషనర్లు తమ దరఖాస్తులను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ, జాతీయ స్థాయిలో నీట్ , ఇతర పరీక్షల వివాదాల ద్వారా పెల్లుబుకిన యువత ఆందోళనల తరహాలోనే, ఏపీలోనూ జెన్ జీ, నిరుద్యోగ యువతను ఏకం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచవచ్చని వైసీపీ వ్యూహరచన చేస్తోంది. సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన తరహా దీక్ష చేస్తే చాలు కదలిక వస్తుందని నమ్ముతున్నారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగి ఆమరణదీక్షకు కూర్చోవాలంటూ ఆ పార్టీ అంతర్గత వర్గాలు సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. డీఎస్సీలో ఉద్యోగాలు రాని లక్షలాది మంది దరఖాస్తుదారులు, వారి కుటుంబాలు ఈ దీక్షకు మద్దతుగా కదిలివస్తే, అది రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతుందని పార్టీ అంచనా వేస్తోంది. కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడానికి , ప్రతిపక్షంగా నిలబడటానికి ఇలాంటి ప్రత్యక్ష పోరాటమే ఏకైక మార్గమని భావిస్తున్నారు. గతంలో తాము కాక్రోచ్‌లమని జగన్ ప్రకటించుకున్నారు. కానీ కాక్రోచ్‌లకు మద్దతు ప్రకటించలేదు. కనీసం వారి తరహాలో దీక్ష అయినా చేయాలని పార్టీ నేతలు కోరుకుంటున్నారు.ఆన్‌లైన్ పరీక్షల పారదర్శకతపై న్యాయపరంగా , సాంకేతికంగా బలమైన ఆధారాలు లేకపోయినా నిరుద్యోగ సమస్యను రాజకీయ అస్త్రంగా మలచుకోవాలనే వైసీపీ ఆకాంక్ష స్పష్టంగా కనిపిస్తోంది. మరి పార్టీ నేతల సలహాల మేరకు జగన్ ఆమరణదీక్ష అనే రిస్క్‌తో కూడిన నిర్ణయాన్ని తీసుకుని ధైర్యం చూపుతారా, లేక యథావిధిగా మీడియా ప్రకటనలు, ప్రెస్ మీట్లకే పరిమితమవుతారా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

# బాధ్యతలు తీసుకుంటామంటున్న 36 వేల మంది
# జనసేనలో సునామీ దరఖాస్తులు

కాకినాడ, జూలై 28, ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన శైలిని వేగంగా మార్చుకుంటూ పరిపూర్ణ రాజకీయ నాయకుడిగా రూపాంతరం చెందుతున్నారు. గతంలో కేవలం ఎన్నికల సమయానికే పరిమితమవుతారనే విమర్శలకు చెక్ పెడుతూ, లభించిన అధికారాన్ని పార్టీ క్షేత్రస్థాయి విస్తరణకు అత్యంత వ్యూహాత్మకంగా వాడుకుంటున్నారు. అధికారంలో భాగస్వామిగా ఉన్న సమయాన్నే పార్టీని కేడర్ బేస్డ్ వ్యవస్థగా మార్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందులో భాగమే రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల నాయకత్వ బాధ్యతల కోసం జనసైనికులు, వీరమహిళలు, క్రియాశీలక కార్యకర్తల నుంచి ఆహ్వానించిన దరఖాస్తుల ప్రక్రియ. ఏకంగా 36,000కు పైగా అప్లికేషన్లు వెల్లువెత్తడం జనసేన పార్టీ పెరుగుతున్న రాజకీయ గ్రాఫ్‌కు నిదర్శనంగా మారింది. ఈ భారీ స్పందన నుంచి కేవలం గుడ్డిగా నియామకాలు చేయకుండా, వడపోత ద్వారా నిఖార్సైన, సిద్ధాంత ప్రాతిపదికన పనిచేసే సైనికులను ఎంపిక చేసే పనిలో పవన్ పడ్డారు. పంచాయతీ నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయి వరకు బలమైన కమిటీలను నిర్మించడం ద్వారా, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామీణ స్థాయిలో జనసేనకు తిరుగులేని పునాది వేయడమే ఆయన ప్రధాన లక్ష్యం. డిప్యూటీ సీఎంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖలు తన వద్దే ఉండటం పవన్‌కు మరో పెద్ద ప్లస్ పాయింట్. పాలనలో తన ముద్ర వేస్తూనే, కేడర్‌కు పనులు చేసిపెట్టే అవకాశాన్ని ఆయన సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు. కూటమిలో ప్రస్తుతం తక్కువ సీట్లతో చిన్న భాగస్వామిగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో తన వాటాను సమానంగా లేదా అంతకంటే ఎక్కువ స్థాయిలో క్లెయిమ్ చేసేందుకు పవన్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఓటు బ్యాంకు మార్పిడిని ఎన్నికల్లో నిరూపించిన ఆయన, ఇప్పుడు సంస్థాగత బలం ద్వారా కూటమిలోనే అత్యంత డిమాండింగ్ ఫోర్స్‌గా మారాలని చూస్తున్నారు. రాజకీయంలో ఏ పార్టీ కూడా శాశ్వతంగా రెండో స్థానంలో ఉండటానికి ఇష్టపడదు. పవన్ కళ్యాణ్ సుదూర వ్యూహం కూడా జనసేనను ఏపీలో ప్రధాన రాజకీయ శక్తిగా నిలబెట్టడమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. జనసేన పుంజుకుంటున్న ఈ వేగం అంతిమంగా మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీకి సాంకేతికంగా పెద్ద సవాలుగానే మారే అవకాశముంది. దశాబ్దాలుగా బలమైన గ్రాస్‌రూట్ నెట్‌వర్క్ ఉన్న టీడీపీకి, అదే క్షేత్రస్థాయిలో జనసేన పోటీదారుగా మారడం భవిష్యత్ ఎన్నికల్లో సీట్ల పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గతంలో టీడీపీకి ఏకపక్షంగా ఉన్న కొన్ని వర్గాల ఓటు బ్యాంకు, ఇప్పుడు జనసేన వైపు బలంగా మొగ్గుతుండటం మేజర్ పార్టీగా ఉన్న టీడీపీకి అంతర్గతంగా కొంత ఆందోళన కలిగించే అంశమే. ఈ రాజకీయ పరిణామాలకు టీడీపీ కూడా ఊరికే ప్రేక్షకపాత్ర వహించే అవకాశం లేదు. పవన్ కళ్యాణ్ అడుగులకు చెక్ పెట్టడానికి లేదా తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి చంద్రబాబు నాయుడు తనదైన రీతిలో వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఒకవైపు కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, మరోవైపు తమ శ్రేణులను కాపాడుకునేందుకు సభ్యత్వ నమోదు, నియోజకవర్గ స్థాయి ఇన్చార్జుల మార్పులు, కార్యకర్తలకు ప్రభుత్వ పథకాల నామినేటెడ్ పదవుల కేటాయింపు వంటి చర్యలను టీడీపీ వేగవంతం చేస్తోంది. జనసేన ఎంతగా బలపడినా, కూటమిలో పెద్దన్న పాత్ర ఎప్పటికీ తమదేనని నిరూపించేలా పాలనాపరమైన మైలేజీని క్రెడిట్ చేసుకునే పనిలో పచ్చజెండా ఉంది.కూటమి ఐక్యత పైన కనిపిస్తున్నప్పటికీ.. లోపల మాత్రం టీడీపీ, జనసేనల మధ్య సంస్థాగత బలాన్ని పెంచుకునే రహస్య పోటీ అత్యంత ఆసక్తికరంగా సాగుతోంది. పవన్ కళ్యాణ్ వేస్తున్న పక్కా పొలిటికల్ స్కెచ్‌లు జనసేనను కొత్త శిఖరాలకు తీసుకెళ్తాయా? లేక చంద్ర బాబు చదరంగపు ఎత్తుల ముందు ఎ ా న ు క ్ ూ ల రాజకీయాలకేపరిమితమవుతాయాఅనేది రాబో యేస్థానికసంస్థలఎన్నికలలోతేలిపో నుంది.

# మండలి రేసులో ఆ నలుగురు

విజయవాడ, జూలై 28, ఆంధ్రప్రదేశ్‌లోఖాళీగా ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై అధికార కూటమి ప్రభుత్వం కసరత్తును అత్యంత ముమ్మరం చేసింది. రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అవుతున్న ఈ నామినేటెడ్ స్థానాలను భర్తీ చేసేందుకు వీలుగా ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే అర్హులైన అభ్యర్థుల పేర్లపై సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. సుదీర్ఘ కాలంగా పార్టీకి నమ్మకంగా సేవలు అందిస్తూ, గత ఎన్నికల్లో రాజకీయ సమీకరణాల వల్ల అవకాశాలు కోల్పోయిన సీనియర్ నాయకులతో కూడిన తుది జాబితాను సిద్ధం చేసే పనిలో టీడీపీ అధిష్టానం నిమగ్నమైంది.ప్రస్తుతం ఈ ఎమ్మెల్సీ రేసులో తెలుగుదేశం పార్టీ కి చెందిన పలువురు హేమాహేమీల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ముఖ్యంగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, రాయలసీమకు చెందిన సీనియర్ నేత, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, కొమ్మాలపాటి శ్రీధర్, మరియు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేర్లు ప్రధానంగా ప్రచారంలో ఉన్నాయి. గతంలో రాజ్యసభ స్థానాలను ఆశించి భంగపడిన వర్ల రామయ్య వంటి నేతలకు ఈసారి ఖచ్చితంగా అవకాశం కల్పించి శాసనమండలికి పంపాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.వీరితో పాటు మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, దేవినేని ఉమామహేశ్వరరావు పిఠాపురం వర్మ కూడా రేసులో నిలిచారు. శాసనమండలిలో డిప్యూటీ ఛైర్మన్ మేయానా జాకియా ఖానం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఈ ఖాళీలను భర్తీ చేయడం ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఒకవైపు సామాజిక సమీకరణాల లెక్కలు చూస్తూనే, మరోవైపు ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా దళిత, బీసీ మరియు మైనారిటీ సామాజిక వర్గాలకు ఈ పదవుల్లో సముచిత స్థానం కల్పించే దిశగా కసరత్తు సాగుతోంది. గవర్నర్ కోటా కింద భర్తీ చేసే ఈ అత్యున్నత స్థానాలకు సంబంధించిన అధికారిక ప్రకటన నేడు రాజ్‌భవన్ నుండి వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం అందుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేసిన అభ్యర్థుల జాబితాకు గవర్నర్ ఆమోద ముద్ర వేసిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఎవరికి ఏ పదవి దక్కుతుందనే దానిపై అమరావతి రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ క్లైమాక్స్‌కు చేరింది.

వంగవీటి రాధకు క్లియర్

విజయవాడ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. ముఖ్యంగా వంగవీటి కుటుంబానికి ఇక్కడ ఉన్న క్రేజ్, ఫాలోయింగ్ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గడిచిన ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణను ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దింపాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానం శతవిధాలా ప్రయత్నించింది. మచిలీపట్నం ఎంపీ సీటుతో పాటు ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు పలు ఆకర్షణీయమైన ఆఫ్షన్లను ఇచ్చింది. అయినప్పటికీ, రాధా మాత్రం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి మాత్రమే పోటీ చేయడానికి ఆసక్తి చూపించారు. అయితే, అక్కడ అప్పటికే నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యేగా ఉండి.. స్వల్ప తేడాతో ఓడిపోయిన బొండా ఉమామహేశ్వరరావు ఉండటంతో.. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బొండాను కాదనలేక, రాధా సైలెంట్ అయ్యి పోటీకి దూరంగా ఉండిపోయారు.తెలుగుదేశం పార్టీకి, వంగవీటి రాధాకు కాగల కార్యాన్ని ఇప్పుడు బొండా ఉమనే స్వయంగా నెరవేరుస్తున్నారు ఇటీవల గుంటూరు సభ వివాదం, వైఎస్ఆర్‌సీపీ నేతలతో ఒకే వేదికను పంచుకోవడం, నియోజకవర్గంలో తలెత్తిన కొన్ని అంతర్గత వివాదాల కారణంగా బొండా ఉమ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోందనే టాక్ వినిపిస్తోంది. అధిష్టానం దృష్టిలో ఆయనపై నమ్మకం సడలడం, వివాదాస్పద అంశాల్లో ఇరుక్కోవడంతో బొండా స్థానం ఇరకాటంలో పడింది. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి.. విజయవాడ సెంట్రల్ పరిధిలో వంగవీటి కుటుంబానికి ఉన్న మాస్ ఇమేజ్, వర్గీకరణలకు అతీతంగా ఉన్న అభిమానం ముందర, రాధా ప్రత్యక్ష బరిలో నిలబడితే ప్రత్యర్థి ఎవరైనా సరే గెలుపు సాధించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యమే.ఇన్నాళ్లూ సెంట్రల్ నియోజకవర్గం సీటు విషయంలో బొండా ఉమ అడ్డుగోడగా ఉన్నారని భావించిన వారికి, ఇప్పుడు ఆయన స్వయంకృతాపరాధాలు, మారిన రాజకీయ సమీకరణలు సరికొత్త అవకాశాన్ని ఇస్తున్నట్లు కనిపిస్తోంది. అధిష్టానం కూడా సెంట్రల్‌లో ప్రత్యామ్నాయ నాయకత్వం వైపు లేదా క్లీన్ ఇమేజ్ ఉన్న బలమైన నేత వైపు మొగ్గు చూపే పరిస్థితిని బొండా ఉమనే స్వయంగా కల్పించినట్లయింది. పార్టీ కోసం, నియోజకవర్గంలో మళ్లీ తిరుగులేని ఆధిపత్యం కోసం రాధా లాంటి మాస్ లీడర్‌ను రంగంలోకి దింపితే తిరుగుండదనే భావన టీడీపీ క్యాడర్‌లోనూ వ్యక్తమవుతోంది. రాధా పోటీ చేసేందుకు ఉన్న ఏకైక అడ్డంకి తొలగిపోయినట్లేనని, వచ్చే ఎన్నికలు లేదా పొలిటికల్ రీ-ఆర్గనైజేషన్ నాటికి విజయవాడ సెంట్రల్ నుంచి వంగవీటి రాధాకృష్ణ పోటీకి మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు

# ఢిల్లీ పర్యటనపై జగన్ మైండ్ గేమ్



విజయవాడ, జూలై 28, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతున్న ఢిల్లీ పర్యటన , ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్‌లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరమైన రాజకీయ చర్చలకు దారితీస్తున్నాయి. ఇంత వరకూ అపాయింట్ మెంట్ ఖరారైనట్లుగా స్పష్టత లేదు కానీ.. భేటీ ఉంటుందని వైఎస్ఆర్‌సీపీ వర్గాలంటున్నాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. కేంద్ర పెద్దలకు తమపైనే ప్రత్యేక అభిమానం ఉందనే సంకేతాలను కేడర్‌లోకి పంపడంలో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వస్తోంది. క్షేత్రస్థాయి ప్రచారంలో టీడీపీ, జనసేనలతో బీజేపీ, కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే పెట్టుకుంది, కానీ మోదీ-షాలకు జగన్ అంటేనే ప్రత్యేక ఇష్టం అనే భావనను నిలబెట్టే ప్రయత్నం నిరంతరం సాగుతుంటుంది. కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకు జగన్‌కు మోదీ-షాలు అపాయింట్‌మెంట్ ఇస్తే ఏపీ రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయనేది ఆసక్తికరంగా మారింది.వైఎస్సార్‌సీపీ వ్యూహాన్ని లోతుగా పరిశీలిస్తే.. ఢిల్లీలో కేంద్ర పెద్దల భేటీ లభిస్తే దాన్ని వెంటనే కూటమిపై మైండ్ గేమ్ ఆడేందుకు ఉపయోగించుకుంటుంది. తమ నేతపై కేంద్ర దర్యాప్తు సంస్థల కదలికలు మందగించడానికి, కూటమి ప్రభుత్వం పగటిపూట చేసే విచారణలకు కేంద్రం వద్ద మద్దతు లభించడం లేదని నిరూపించడానికి ఈ అపాయింట్‌మెంట్‌ను ఒక రుజువుగా చూపే అవకాశం ఉంది. జగన్ విజ్ఞప్తులను వినడానికి ప్రధాని లేదా హోంశాఖ మంత్రి సమయం కేటాయిస్తే.. చూశారా! కూటమి ఎన్ని ఆరోపణలు చేసినా కేంద్రం జగన్ మాటకే ప్రాధాన్యం ఇస్తోంది అని క్షేత్రస్థాయిలో జోరుగా ప్రచారం చేసుకోవడం ద్వారా సొంత కేడర్‌లో ధైర్యం నూరిపోసేందుకు వైసీపీకి అవకాశం లభిస్తుంది. ఇక కూటమి పరంగా చూస్తే.. ప్రధాని లేదా హోంశాఖ మంత్రి జగన్‌కు ముఖాముఖి సమయం ఇవ్వడం కూటమి శ్రేణుల్లో సాంకేతికంగా కొంత గందరగోళాన్ని సృష్టించే ముప్పు ఉందనేది కొట్టిపారేయలేని నిజం. ముఖ్యంగా టీడీపీ, జనసేన శ్రేణులు సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన చారిత్రాత్మక విజయం తర్వాత, వైసీపీ శ్రేణులకు అంతర్గతంగా పొందే ఒక నైతిక విజయం గా ఇది రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న విచారణలు, అరెస్టులపై జగన్ ఇచ్చే వినతిపత్రాలు ఢిల్లీ స్థాయిలో చర్చనీయాంశమైతే, అది కూటమి ఐక్యత , ప్రభుత్వ ఇమేజ్‌పై స్వల్ప ప్రభావం చూపవచ్చనే ఆందోళన స్థానిక నేతల్లో వ్యక్తమవుతుంటుంది. ఢిల్లీ రాజకీయాల యంత్రాంగాన్ని డీకోడ్ చేస్తే.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం నరేంద్ర మోదీ, అమిత్ షాలు అంత సులభంగా విపక్షాల ట్రాప్‌లో పడే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది. రాజకీయ వ్యూహకర్తగా అమిత్ షా వైఖరి ఎప్పుడూ స్పష్టంగా ఉంటుంది. ప్రాంతీయ పార్టీల అంతర్గత కలహాల్లో దూరి తమ మిత్రపక్షాలకు ఇబ్బంది కలిగించే రాజకీయాలకు వారు దూరంగా ఉంటారు. ప్రస్తుతం ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యంత బలమైన మెజారిటీతో, చంద్రబాబు సీఎంగా, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా సుస్థిర పాలన అందిస్తోంది. ఇటువంటి సమయంలో కూటమి ఐక్యతకు హాని కలిగించే లేదా మిత్రపక్షాల్లో అనుమానాలు రేకెత్తించే సంకేతాలను అధిష్టానం ఇవ్వాలనుకోదు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు లేదా మాజీ ముఖ్యమంత్రి సమయం కోరినప్పుడు, నిబంధనల ప్రకారం లేదా సాధారణ ప్రోటోకాల్ ప్రకారం వినతిపత్రాలు స్వీకరించడం కేంద్ర మంత్రుల విధి. అయితే, దాన్ని ప్రత్యేక రాజకీయ సంబంధంగా చిత్రీకరించే వైసీపీ ప్రయత్నాలను అటు బీజేపీ జాతీయ వర్గాలు కూడా గమనిస్తూనే ఉన్నాయి. అందుకే ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇచ్చినప్పటికీ, అది కేవలం ప్రజాస్వామ్యబద్ధమైన వినతుల స్వీకరణకే పరిమితమని, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేనలకు ఇచ్చే ప్రాధాన్యతలో ఎలాంటి మార్పూ ఉండదని స్పష్టమైన సంకేతాలను బీజేపీ ఇస్తోంది. మోదీ, షాలు ఇచ్చే సాధారణ అపాయింట్‌మెంట్‌ను రాజకీయ ప్రచారానికి వాడుకోవాలని చూసినప్పటికీ, అది కూటమి పునాదులను కదిలించే స్థాయికి వెళ్లకపోవచ్చని భావిస్తున్నారు. చంద్రబాబు రాజకీయ అనుభవం, పవన్ కళ్యాణ్ బీజేపీతో కొనసాగిస్తున్న దృఢమైన బంధం ముందు జగన్ భేటీలు తాత్కాలిక సంచలనాలకే పరిమితమవుతాయి. ఎన్డీయే కూటమి తన పరిపాలనాజెండాతో ముందుకు సాగుతున్నంత కాలం, ఢిల్లీ భేటీల పేరుతో సాగే పొలిటికల్ మైండ్ గేమ్‌లు ఏపీ అసలు రాజకీయ సమీకరణాలను మార్చలేవని ఎక్కువ మంది భావిస్తున్నారు

# వైసీపీ సీనియర్లలో అసంతృప్తులు

నెల్లూరు, జూలై 28, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ఆ పార్టీ సీనియర్లలో ఆందోళన అదే. ప్రజా పోరాటాలు చేయడం లేదు. ప్రజా ఆందోళనలు నిర్వహించడం లేదు.. జాతీయస్థాయిలో జరుగుతున్న పెద్ద ఉద్యమాలకు మద్దతు తెలపడం లేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చుట్టూ వివాదాలు, కేసులు నడుస్తున్నాయి. అలాగని గత ప్రభుత్వ హయాంలో జరిగిన కేసులు కావు. ఇందులో నేరుగా కూటమి ప్రభుత్వం కలుగజేసుకోవడం లేదు. కానీ ఒక్క వైసీపీ నేతపై కేసు నమోదు అవుతుంది. అరెస్టుల పర్వం నడుస్తోంది. దీనిపైనే వైసీపీలో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగత వ్యవహార శైలితో పార్టీని కొంతమంది నేతలు డ్యామేజ్ చేస్తున్నారన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఇది పార్టీ పై ప్రతికూలత చూపుతోందన్న ఆవేదన సీనియర్లలో ఉంది. ఇన్ని రోజులు అధినేత జగన్మోహన్ రెడ్డి ఏం చేసినా ఊరుకున్నామని.. ఇకనుంచి ఊరుకోబోమని వారు చెబుతున్నారు. హెచ్చరించినంత పని చేస్తున్నారు.కొద్ది రోజుల కిందట సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పార్టీలోనే పవర్ఫుల్ నేత ఆయన. మరి ఎందుకు ఆ స్థాయిలో మాట్లాడడం లేదు అని రిపోర్టర్ ప్రశ్నించేసరికి పెద్దిరెడ్డి వింత సమాధానం చెప్పారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదనతో సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తాను అటువంటిదే కోరుకుంటానని.. తమ పార్టీ నేత అంబటి రాంబాబు లా మాట్లాడను అంటూ చురకలు అంటించారు. అయితే అది అంబటి రాంబాబు నువ్వు ఉద్దేశించింది కాదు. తెర వెనుక జగన్ వైఖరిని తప్పు పట్టడమే దాని ముఖ్య ఉద్దేశం. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే కాదు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు లాంటి సీనియర్ నేతలు వైసీపీలో అనవసర వ్యాఖ్యలు చేసే నాయకుల వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది.మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం పాత కేసులను తెరపైకి తెచ్చి వెంటాడింది అని వైసిపి ఆరోపించింది. కానీ ఇప్పుడు ఒక్కో నేత అరెస్టు తీరు చూస్తే మాత్రం భిన్నంగా ఉంది. కేసులు నమోదు కావడం వెనుక చూస్తుంటే వ్యక్తిగత వ్యవహార శైలి కనిపిస్తోంది. మాజీ మంత్రి అప్పలరాజు వ్యవహరించిన తీరుతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. తన కుమారుడు బైక్ రైటింగ్ కారణంగా ఓ మనిషి ప్రమాదానికి గురయ్యారు. కానీ అది తన కొడుకు మెడకు చుట్టుకోకుండా మరో వ్యక్తిని బలిపశువు చేయడానికి చూశారు. దానిని కూడా సక్రమంగా హ్యాండిల్ చేయలేకపోయారు. చివరకు ఆయన అరెస్టు కూడా జరిగిపోయింది. పార్టీకి డ్యామేజ్ మిగిల్చింది. తమ్మినేని సీతారాం గురించి అయితే చెప్పనవసరం లేదు. స్పీకర్ గా ఉంటూనే ఒక భూమి యజమాని బతికుండగానే ఆయన వారసుల పేరుతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి.. తన కుమారుడి పేరుతో నాలుగు కోట్ల విలువైన భూమిని రాయించుకున్నారు.. సామాన్యులు సైతం దీనిని తప్పుపడుతున్నారు.తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. జోగి రమేష్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు 11 మందిపై కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం, గృహహింస, హత్యాయత్నం వంటి ఆరోపణలు చేస్తూ ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీంతో జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. వీటిని రాజకీయ కక్ష్యలో చూపించే ప్రయత్నం జరుగుతోంది. కానీ ఇది వ్యక్తిగత కేసులు అన్నది ప్రజలకు తెలుసు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజా పోరాటాలు చెయ్యకపోగా ఇలా వ్యక్తిగత వైఖరితో పార్టీని డ్యామేజ్ చేస్తున్నారు అనేది సీనియర్ల అభిప్రాయం.

అంతకుమించి జగన్ వారిని వెనుకేసుకు రావడం పై కూడా పార్టీలో భిన్న స్వరం వినిపిస్తోంది. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

## ఫ్లై ఓవర్ల కింద విద్యుద్ సబ్ స్టేషన్లు

హైదరాబాద్ నగరంలో ఫ్లై ఓవర్స్ కింద ఉన్న ఖాళీ స్థలాలలో సబ్ స్టేషన్ నిర్మాణాలను చేపట్టనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ ఓ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. హైదరాబాద్ వీఎస్టీ స్టీల్ బ్రిడ్జ్ కింద ఏర్పాటు చేయనున్న సబ్ స్టేషన్ స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఛైర్మెన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫ్లై ఓవర్స్ స్ట్రక్చర్ కు ఎలాంటి హాని కలుగకుండా సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతామన్నారు. వీటి నిర్మాణాల వల్ల ఉన్న సబ్ స్టేషన్ లపై లోడ్ తగ్గడంతో పాటు , కొత్త కనెక్షన్ లకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నగరంలో ఐదు చోట్ల ఫ్లై ఓవర్ కింద స్థలాలను గుర్తించామని , త్వరలో అక్కడ సబ్ స్టేషన్ నిర్మాణం చేపడతామని ఆయన వివరించారు.

# కుత్బుల్లాపూర్ లో చైన్ స్నాచింగ్



మేడ్చల్ కుత్బుల్లాపూర్ లో చైన్ స్నాచింగ్ జరిగింది. స్నాచర్ ఒక వృద్ధురాలి మెడలో నుంచి మూడు తులాల చైన్ లాక్కెళ్లాడు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిగిలోని హెచ్ఏఎల్ కాలనీ లో చైన్ స్నాచింగ్ జరిగింది. ఇంటిముందు కూర్చున్న వృద్ధురాలు వెంకమ్మ(80) మెడలో నుండి 3తులాల గొలుసునుదుండగుడు లాక్కెళ్లాడు. కాలనీ వాసులు చైన్ స్నాచర్ ను వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేసారు. చైన్ స్నాచింగ్ చేసిన బైక్ ను వదిలి కాలనీవాసుల నుండి నిందితుడు తప్పించుకు పారిపోయాడు.

# డివిజనల్ బెంచ్ కు సర్కార్..

హైదరాబాద్, జూలై 28 హైడ్రా కమిషనర్గా రంగనాథ్ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రంగనాథ్ స్పందించారు. తాము రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తున్నామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటివరకు సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి, వేల ఎకరాల భూములను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని, ఇటీవల లోతుకుంటలో భూకబ్జా యత్నాన్ని కూడా అడ్డుకుందని తెలిపారు.ఆక్రమణల తొలగింపుతో పాటు ఇప్పటికే 6 చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ల్యాండ్ మాఫియా కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని, తనపై ఉన్న కోర్టు ధిక్కార కేసులన్నీ భూకబ్జాదారులు వేసినవేనని ఆరోపిస్తూ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని.. ఆ కేసులన్నింటినీ చట్టపరంగానే ఎదుర్కొంటానని ఆయన అన్నారు.హైడ్రా కమిషనర్గా రంగనాథ్ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది. హైడ్రా కమిషనర్గా దాదాపు రెండేళ్ల నుంచి కొనసాగుతూ వచ్చిన రంగనాథ్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే విషయంలో సస్పెన్స్గా మారింది. అయితే హైకోర్టు ఆదేశాలపై ఆచితూచి స్పందించాలని ప్రభుత్వం నభావిస్తోంది. రంగనాథ్ విషయంలో వేచి చూసే ధోరణిలో ముందుకు సాగాలని యోచిస్తోంది. తీర్పునకు సంబంధించిన ఆర్డర్ కాపీ ఆధారంగా న్యాయసలహా తీసుకోవాలని డిసైడయ్యింది.ఇక ఈ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు ఇంటలిజెన్స్ చీఫ్. దీనిపై న్యాయసలహా తీసుకోవాలని సీఎస్కు సీఎం రేవంత్ ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇక హైడ్రాపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులపై సీఎస్ ఆరా తీస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఈ కేసులో సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్లో అప్పీల్కు వెళ్లడంపై ప్రభుత్వం సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది.

### కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై డోర్ టు ప్రోగ్రాం

శిరివెళ్ల సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గారు ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు గౌరవనీయులైన అఖిలమ్మ గారి ఆదేశాలతో రెండవ రోజు డోర్ టు డోర్ క్యాంపియన్ లో భాగంగా 70వ బూతు పరిధిలో ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు రెండు ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమాన్ని గురించి వివరించడం జరుగుతున్నది అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకమవుతు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు మా దృష్టికి తీసుకువస్తే మేము ఎమ్మెల్యే గారైన అఖిలమ్మ గారి దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు తెలియజేస్తూ ఈ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మా వంతుగా విజయవంతం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. కార్యక్రమంలో 70 బూతు ఇంచార్జి కేడం సుబ్బారావు తెలుగుదేశం పార్టీ నాయకులు నీటి సంఘం అధ్యక్షులు చిలుకల రాంపుల్లయ్య, కోకన్వీనర్ చిలుకల లక్ష్మీనారాయణ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.

# అనర్హులకు డబుల్ బెడ్ రూములు ఇస్తున్నారు

## కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ డబుల్ బెడ్ రూంలు నిరుపేదలకు ఇవ్వకుండా మంత్రుల కలెక్టర్ల అనుచరులను ఇవ్వడంపై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. దేశంలో ప్రజలను నిత్యం మోసం చేసే పార్టీనే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టరాజ్యానికి పాల్పడుతోంది. ఖైతలాపూర్ లో కేసీఆర్ ప్రభుత్వంలో 145 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించారు.నాలా పక్కన జీవిస్తున్న అమృత్ నగర్ తండా వాసులకు ఇవ్వాలని డిమాండ్ చేశాం. నిరుపేదలై విలేకరులకు ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్ కి వినతిపత్రం అందించాం. హౌసింగ్ బోర్డు వీసీ తరుపున ఒకరికి డబుల్ బెడ్ ఇచ్చారు. హైదరాబాద్ రంగారెడ్డి కలెక్టర్ తరుపున మరొకరికి డబుల్ బెడ్ రూం. ఖమ్మం లో నివసిస్తున్న మహిళకు కూకట్ పల్లి లో డబుల్ బెడ్ రూం ఇచ్చారని అన్నారు. ఎండోన్మెంట్ కమిషనర్ తరుపున మరొకరికి డబుల్ బెడ్ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ రెవిన్యూ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న ప్రత్యూషకి డబుల్ బెడ్ రూం. పొన్నం ప్రభాకర్ పైరవీతో నరేష్ కుమార్ అనే వ్యక్తికి డబుల్ బెడ్ రూం ఇచ్చారు. మాజీ పిసిసి అధ్యక్షుడు డి శ్రీనివాస్ అల్లుడు శైలజ పేరుమీద మరొకరికి డబుల్ బెడ్ రూం, మంత్రులు కలెక్టర్లు లెటర్లు రాయడం డబుల్ బెడ్ రూములు కేటాయించడం ఇదేనా ప్రజా పాలన. కూకట్ పల్లి నిరుపేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇవ్వాలని కేసీఆర్ ప్రభుత్వం ఇండ్లు కట్టింది.కనీస నిబంధనలు పాటించడం లేదు. ఎవరికి పడితే వారికి ఇష్టం వచ్చినట్లు అలాట్మెంట్ ఇస్తున్నారు..డబుల్ బెడ్ రూం ఇండ్లకోసం ఎలాంటి అప్లికేషన్ పెట్టుకొని వ్యక్తులకు కాంగ్రెస్ మంత్రులు ఇండ్లు ఇస్తున్నారు. అక్రమంగా లోపాయికారి తనంతో డబ్బులు గుంజుతూ పైరవీ లేఖలతో అమ్ముకుంటున్నారు.హైదరాబాద్ నగర ప్రజలకు లక్ష డబుల్ బెడ్ రూం ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నారు.అప్లికేషన్ పేరుమీద 10 వేల రూపాయలు కట్టించుకొని ప్రజలను మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. అరులక్షల రూపాయలు కట్టితే ఇండ్లు కేటాయేస్తం అంటున్నారు. నిరుపేదలు అరులక్షల రూపాయలు కట్టుకొనే స్థోమత ఉంటుందా అని ప్రశ్నించారు.

కెసిఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూంలు కట్టించి ఒక్క రూపాయ తీసుకోకుంటా నిరుపేదలను ఇండ్లు అందించాం. మేడ్చల్ కలెక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిపక్షపాతంగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ,బీజేపీ పార్టీలు ఒక్కరు కూడా డబుల్ బెడ్ రూం ఇండ్ల అవినీతిపై మాట్లాడారు. కాంగ్రెస్ మంత్రులు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇండ్లను ఇస్తే హైకోర్టుని ఆశ్రయిస్తామని అయన అన్నారు.

# కేంద్ర మంత్రిగా దగ్గుబాటి పేరు...

న్యూఢిల్లీ, జూలై 28, కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. విద్యావ్యవస్థలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేశారు. ఇందులో యాదృచ్ఛికం ఏంటంటే.. స్వతహాగా విద్యార్థి నాయకుడిగా ఉండేవారు ధర్మేంద్ర ప్రధాన్. ఇప్పుడు అదే విద్యార్థి లోకం ఆందోళనల ఫలితంగా పదవికి దూరమయ్యారు. ఈ విషయాన్ని పక్కన పెడితే ఇప్పుడు తదుపరి కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎవరు అనే చర్చ బలంగా నడుస్తోంది. అయితే ఈసారి సమర్థులకు అవకాశం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారు. క్యాబినెట్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఏపీ నుంచి ఈసారి అవకాశం ఉంటుంది అనేది ప్రధానంగా జరుగుతున్న చర్చ. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఆమె క్యాబినెట్లో పనిచేసిన అనుభవం ఉండడంతో ఆమె వైపు మోది మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. డ్యామేజ్ కంట్రోల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ సైతం స్పందించారు. పేపర్ లీకేజీ ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేయడంతో పాటు పారదర్శకంగా ఇకనుంచి వ్యవహరిస్తామని కూడా చెప్పుకొచ్చారు. మరోవైపు జనతా కాక్రోచ్ ఉద్యమంతో దేశ అంతర్గత భద్రతకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఉద్యమం పక్కదారి పట్టి ఛాన్స్ అధికంగా ఉంది. ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించింది కేంద్ర ప్రభుత్వం. అందుకే విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించింది. అయితే తదుపరిగా ఈ బాధ్యతలు ఎవరు తీసుకుంటారు అనే ప్రశ్న వినిపించింది. అయితే ఆ అవకాశం ఏపీకి చెందిన మహిళ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి దక్కుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.మూడోసారి ఎంపీ అయ్యారు దగ్గుబాటి పురందేశ్వరి. తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో విభేదించి.. భర్త వెంకటేశ్వరరావు తో కలిసి పురందేశ్వరి 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో రెండోసారి పోటీ చేసి గెలిచారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్రమంత్రి పదవి చేపట్టారు. సమర్థవంతమైన నేతగా జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. 2014 ఎన్నికల కు ముందు అనూహ్యంగా భారతీయ జనతా పార్టీలో చేరారు. పొత్తులో భాగంగా ఆమె రాజంపేట నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో రాజమండ్రి ఎంపీ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు. మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలని భావించారు. కానీ వివిధ సమీకరణలో దక్కలేదు. ఇప్పుడు పునర్వ్యవస్థీకరణలో ఆమెకు చాన్స్ దక్కుతుందని ప్రచారం జరిగింది. ఇంతవరకు మంత్రివర్గాన్ని విస్తరించలేదు మోడీ. ఇప్పుడు అనూహ్యంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పురందేశ్వరికి ఆ శాఖ ఇస్తారని తెలుస్తోంది. అయితే పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇస్తారా? లేకుంటే ఇప్పుడే ఇస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

# తెరపైకి మరో రెండు ఉద్యమాలు..

న్యూఢిల్లీ, జూలై 28, సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి పుట్టుకొచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మొన్నటి వరకు సోషల్ మీడియా వేదికగా ఉద్యమించిన సీజేపీ నీటి ప్రశ్నపత్రం లీకేజీ, విద్యా వ్యవస్థలో లోపల పై ప్రత్యక్ష ఆందోళన చేపట్టింది.

ఏకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లక్ష్యంగా ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద నిరసనకు దిగింది. 20 రోజుల పైగా సాగిన ఉద్యమంతో విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇదే స్ఫూర్తితో ఇప్పుడు మరో ఉద్యమం మొదలయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇన్ స్టాగ్రామ్ లో అకస్మాత్తుగా పెరిగిన ఖీవబవతీలజీబితినీని ఊజీబిజీనీ ఒనిటనీశ్రీజీని (ఖీఊం) యువత దృష్టిని ఆకర్షిస్తోంది. కుల ఆధారిత రిజర్వేషన్లో మార్పులు, మెరిట్, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని కోరుతూ ఇది వేగంగా వ్యాపిస్తోంది. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పౌరుల నేతృత్వంలోని ఉద్యమంగా తమను తాము రూపు దిద్దుకుంటోంది.ఇటీవలి విద్యార్థి నిరసనల (పరీక్షల లీక్లు వంటి సమస్యలపై) తర్వాత ఈ ఇన్ స్టాగ్రామ్ పేజీ ఫాలోయింగ్ అకస్మాత్తుగా పెరిగింది. కొన్ని గంటలు/రోజుల్లోనే లక్షల మంది ఫాలోవర్లను చేరుకోవడం వైరల్ అయింది. యూజర్ ప్రకారం 34 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇది ప్రధానంగా జెన్ జెడ్, సాధారణ కేటగిరీ విద్యార్థుల మధ్య చర్చను రేకెత్తించింది. “సమానత్వం, మెరిట్, న్యాయం” వంటి నినాదాలతో ఇది ఆన్లైన్లో వేగంగా వ్యాపిస్తోంది.ప్రస్తుత కుల ఆధారిత కోటాలను (విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో) సమీక్షించాలని లేదా తొలగించాలని కోరుతూ, మెరిట్, నైపుణ్యం, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని వాదిస్తోంది. కులం బదులు నిజమైన పేదరికం ఆధారంగా సహాయం, అధికారిక ఫారమ్లలో కుల ప్రకటనలు తగ్గించడం వంటి అంశాలు ముందుకు వస్తున్నాయి. ఒక తరం/కుటుంబానికి పరిమితం చేయడం లేదా క్రీమీ లేయర్ను మరింత కఠినంగా అమలు చేయడం వంటి సంస్కరణలు కూడా చర్చలో ఉన్నాయి.విద్యా అవకాశాల్లో అసమాన కట్–ఆఫ్లు, క్రీమీ లేయర్ సమస్యలు, కులం ఇంకా అధికారికంగా కొనసాగడం వంటి అంశాలపై యువతలో నిరాశ కనిపిస్తోంది. సోషల్ మీడియా ద్వారా త్వరగా వ్యాపించే సామర్థ్యం, రాజకీయ పార్టీల నుంచి దూరంగా ఉండాలనే ప్రకటన దీనికి ప్రాచుర్యం తెచ్చాయి. అయితే ఇలాంటి ఆన్లైన్ ఉద్యమాలు తరచూ భావోద్వేగంతో పెరుగుతాయి. నిజమైన సామాజిక మార్పుకు ఆఫ్లైన్ చర్చలు, విస్తృత సంప్రదింపులు అవసరం.

రిజర్వేషన్ కుల స్పృహను కొనసాగిస్తుందని, మెరిట్ను బలహీనపరుస్తుందని, ఆర్థికంగా బాగా ఉన్నవారికి కూడా ప్రయోజనం చేకూరుస్తుందని అంటారు. ఆర్థిక ఆధారిత వ్యవస్థ మరింత సమానమని వాదిస్తున్నారు 1950ల నాటి వ్యవస్థను సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో చారిత్రక అన్యాయాలు, నేటికీ కొనసాగుతున్న వివక్ష, ప్రాతినిధ్య అవసరం వంటి కారణాలతో రిజర్వేషన్ అవసరమన్న వాదన ఉంది. రిజరేషన్లు అకస్మాత్తుగా తొలగిస్తే అసమానతలు పెరగవచ్చని పేర్కొన్నారు. కులం ఆధారిత సమస్యలు పూర్తిగా అంతం కాలేదనే వాదన ఉంది. ఇంకోవైపు రెండు వైపులా చెల్లుబాటు అయ్యే అంశాలు ఉన్నాయి. రిజర్వేషన్ లక్ష్యం సామాజిక న్యాయం, కానీ అమలులో సమస్యలు, కాలక్రమేణా మార్పుల అవసరం.

ఇలాంటి ఉద్యమాలు రాజకీయాల్లోకి లాగబడే ప్రమాదం ఉంది. రాజ్యాంగ సవరణలు, న్యాయస్థానాల పరిశీలన, విస్తృత సామాజిక సమ్మతి లేకుండా పెద్ద మార్పులు కష్టం. ఆర్థిక ప్రమాణాలను బలోపేతం చేయడం, విద్యా నాణ్యతను పెంచడం, క్రీమీ లేయర్ను సమర్థవంతంగా అమలు చేయడం వంటి మధ్యమార్గాలు ఎక్కువ చర్చనీయాంశాలు కావచ్చు.ఆర్ హెచ్ ఏ సోషల్ మీడియా ద్వారా యువతలోని నిరాశను ప్రతిబింబిస్తోంది.

ఇది రిజర్వేషన్ విధానం గురించి తాజా చర్చను రేకెత్తించింది. అయితే నిజమైన పరిష్కారం ఒక పక్షం వాదనలపై కాకుండా, డేటా, సామాజిక వాస్తవాలు, రాజ్యాంగ సూత్రాల ఆధారంగా సమతుల్యమైన సంస్కరణల్లో ఉంటుంది.

# లీగల్ నోటీసులతో సరి...

హైదరాబాద్, జూలై 28, తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరు సరికొత్త మలుపులు తిరుగుతోంది. ఇంటర్మీడియట్ మార్కుల వివాదంతో ముడిపడిన గ్లోబ్ఎరీనా సంస్థ కేటీఆర్‌దేనని, అది ఆయన బినామీ కంపెనీ అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సంచలన ఆరోపణలపై కేటీఆర్ మరోసారి లీగల్ నోటీసు అస్త్రాన్ని ప్రయోగించారు. 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అయితే, రేవంత్ రెడ్డి విసురుతున్న తీవ్రమైన రాజకీయ ఆరోపణలను కేటీఆర్ మైదానంలో రాజకీయంగా తిప్పికొట్టకుండా, పదే పదే న్యాయస్థానాలు ,లీగల్ నోటీసుల వెనుక దాక్కుంటున్నారనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.గతాన్ని పరిశీలిస్తే కేటీఆర్ ఈ తరహా లీగల్ రూట్‌ను ఎంచుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి వైట్ ఛాలెంజ్ విసిరినప్పుడు , డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు కూడా ఆయన రాజకీయ సభల్లో రేవంత్‌ను గట్టిగా దెబ్బతీయడం కంటే కోర్టుల్లో కేసులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ వివాదం, బావమరిది ఫామ్‌హౌస్ రచ్చ, ఫార్ములా–ఈ రేస్ లీగల్ ప్రాసెస్, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల సమయంలోనూ పదుల సంఖ్యలో నాయకులకు లీగల్ నోటీసులు పంపారు. ఒక నాయకుడిగా తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఇది చట్టపరంగా సరైన మార్గమే అయినప్పటికీ, ప్రజాక్షేత్రంలో మాత్రం ఇది ఒక రకమైన రక్షణత్మక శైలి గా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజా క్షేత్రంలోనే వాటిని ఖండించాలి. రేవంత్ రెడ్డి ప్రజాదరణ పొందిన మాస్ లీడర్ శైలిలో ఘాటైన భాషతో, మీడియా వేదికలపై బహిరంగ దాడి చేస్తుంటే, కేటీఆర్ కూడా తన పద్ధతిలో కౌంటర్ ఇస్తున్నపటికీ అదనంగా కార్పొరేట్ పద్ధతిలో లీగల్ నోటీసుల కాగితాలను ముందుకు తెస్తున్నారు. రేవంత్ చేసే ప్రతి ఆరోపణకు మైక్ ముందుకు వచ్చి గంటల తరబడి ఆధారాలతో కౌంటర్ ఇవ్వకుండా, కేవలం లీగల్ టీమ్‌తో నోటీసులు పంపడం వల్ల.. కేటీఆర్ దగ్గర రాజకీయంగా రేవంత్‌ను ఢీకొట్టే కంటెంట్ లేదా పవర్ లేదా అనే సందేహం సామాన్య ప్రజల్లోకి వెళ్తోంది. ప్రజాస్వామ్యంలో కోర్టు నోటీసుల కంటే ప్రజా కోర్టులోనే నిజానిజాలు తేలాలనేది మెజారిటీ ఓటర్ల భావన. ఈ లీగల్ నోటీసుల స్ట్రాటజీ వల్ల రేవంత్ రెడ్డికి రాజకీయంగా మరింత మేలు జరుగుతోందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. కేటీఆర్ నోటీస్ ఇవ్వగానే.. నేను దేనికైనా సిద్ధం, విచారణ జరిపిస్తాం అని రేవంత్ రెడ్డి ఆ ఆరోపణలను మరింత గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఫలితంగా, గ్లోబ్ఎరీనా లేదా ఇతర ఆరోపణలు మీడియాలో రోజుల తరబడి నానుతూ, కేటీఆర్‌కు ప్రతికూల ప్రచారంగా మారుతున్నాయి. ఒక రకంగా కేటీఆర్ పంపే నోటీసులే రేవంత్ రెడ్డి ఆరోపణలకు మరింత పబ్లిసిటీ తెచ్చిపెడుతున్నాయనే సత్యాన్ని బీఆర్ఎస్ వ్యూహకర్తలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.మాజీ మంత్రిగా, ఒక సమర్థవంతమైన పాలకుడిగా ఐటీ రంగాన్ని నడిపిన కేటీఆర్.. చట్టపరమైన ప్రక్రియల ద్వారా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనుకోవడం సాంకేతికంగా సరికావచ్చు. కానీ, తెలంగాణ వంటి హై–ఓల్టేజ్ రాజకీయాలు నడిచే రాష్ట్రంలో కార్పొరేట్ తరహా లీగల్ బెదిరింపులు పాలిటిక్స్‌లో పనిచేయవు. శత్రువు విసిరిన బాణాన్ని చట్టంతో కాకుండా, అంతకంటే పవర్ ఫుల్ పొలిటికల్ అస్త్రంతో తిప్పికొట్టినప్పుడే కేడర్‌లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రతి అంశంపై సభలు, సమావేశాలు పెట్టి ఆధారాలతో ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టకపోతే.. ఆయనకు రాజకీయంగా రేవంత్‌ను ఎదుర్కొనే సత్తా తగ్గుతోందనే ప్రచారం నిజమేనని ప్రజలు నమ్మే ప్రమాదం ఉందని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# తీవ్ర వర్షాభావ పరిస్థితులతో నీటి కష్టాలు

హైదరాబాద్, జూలై 28, తెలంగాణ రాష్ట్రంలో భీమా నది పరిసర ప్రాంతాల్లో పరిస్థితులు దారుణంగా మారాయి. కర్ణాటక రాష్ట్రం నిర్మించిన రోడ్–కమ్–బ్యారేజీల వల్ల తెలుగు రాష్ట్రాలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఒక్కో బ్యారేజీ 1.5 టీఎంసీ నీటిని నిల్వ చేస్తుందని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి 3 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణా నది కూడా ఈ పరిస్థితిని అనుభవిస్తోంది, దీంతో పాలమూరు జిల్లాలో పంటలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ప్రస్తుత కరవు పరిస్థితుల్లో, సాగు మరియు తాగు నీటికి కూడా కష్టాలు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడం, పంటల సాగు ప్రశ్నార్థకంగా మారడం రైతులకు కష్టాలను తెచ్చిపెడుతోంది. తొలకరి చినుకులు పడుతున్నా, రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి తీవ్రంగా కష్టపడుతున్నారు. నారాయణపేట జిల్లా తంగిడిగి వద్ద కృష్ణా మరియు భీమా నదుల సంగమం ద్వారా రాష్ట్రంలోకి నీటిని ప్రవేశపెట్టడం జరుగుతోంది. కర్ణాటక ప్రభుత్వం 7 రోడ్–కమ్–బ్యారేజీలను నిర్మించడంతో, ఈ ప్రాంతంలో నీటి నిల్వ సమస్యలు పెరిగాయి. గూడూరు, చిగనూరు, కందల్లి, యాద్గిర్, సన్నత్తి, నీలోగి, గానుగాపూర్ వంటి ప్రాంతాల్లో ఈ బ్యారేజీలు నిర్మించబడ్డాయి.ఈ బ్యారేజీల నిర్మాణం వల్ల కృష్ణా నదిపై గిరిజాపూర్, గూగల్, తింతిని బ్యారేజీల ద్వారా పెద్ద ఎత్తున నీటిని నిల్వ చేయడం జరుగుతోంది. ఈ బ్యారేజీల సామర్థ్యం 1.5 టీఎంసీగా చెబుతున్నా, వాస్తవానికి 3 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. గతంలో ఇనుప షీట్లు ఉపయోగించి నీటిని నిల్వ చేసేవారు, ఇప్పుడు హైడ్రాలిక్ గేట్లు మరియు రబ్బర్లు ఉపయోగించి నీటిని అడ్డుకుంటున్నారు. కర్ణాటక ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తూ రోడ్–కమ్–బ్యారేజీలు నిర్మించడం, తెలుగు రాష్ట్రాలకు నష్టాన్ని కలిగిస్తోంది. ఈ పరిస్థితులు కొనసాగితే, సాగు మరియు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పాలమూరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కనీవినీ ఎరుగని కరవు**

ప్రపంచంపై ప్రకృతి తీవ్రంగా దాడి చేస్తోందని తెలంగాణ వ్యవసాయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గత 150 సంవత్సరాలలో ఎన్నడూ చూడని తీవ్ర కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం వల్ల దేశానికి రావాల్సిన నైరుతి రుతుపవనాల జాడ లేకుండా పోయిందని, దాంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దీని ప్రభావం వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల వరకు ఉండే అవకాశం ఉందని, రాబోయే రోజుల్లో సరైన వర్షాలు కురవవని ఐఎండీ మరియు అంతర్జాతీయ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు.వచ్చే నెలలో కురిసే స్వల్ప వర్షాలు కేవలం మెట్ట పంటలకు మాత్రమే ఉపయోగపడతాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయడం చాలా కష్టతరమని స్పష్టం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు తక్కువ సమయంలో, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీల పనితీరును పరిశీలించేందుకు 6 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, ఇవి వారం రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు.

# తెరపైకి జెన్జీ క్యాబినెట్

## అవకాశం తనకే అంటున్న అనిరుధ్ రెడ్డి

మహబూబ్ నగర్, జూలై 28, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళన ఊహాగానాలతో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కూడా రేసులోకి వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో, నూతనంగా విస్తరించే క్యాబినెట్‌లో తనలాంటి యువ ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించాలని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు యువ రక్తానికి మంత్రివర్గంలో చోటు కల్పించాల్సిన అవసరం ఉందనే చర్చ క్షేత్రస్థాయిలో నడుస్తోందని గుర్తుచేశారు. బహుశా జెన్ జీ ఉద్యమాలు జరుగుతున్నాయి కాబట్టి.. తనను జెన్ జీ ఖాతాలో వేసుకోవాలని ఆయన చెబుతున్నట్లుగా ఉంది.ప్రజాకాంక్షలకు అనుగుణంగా నూతన మంత్రివర్గ ఏర్పాటు జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని అనిరుధ్ రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలతో మమేకమవుతూ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే యువ నాయకులను మంత్రులుగా చూడాలని తమ నియోజకవర్గాల ప్రజలతో పాటు రాష్ట్ర యువత కోరుకుంటోందని స్పష్టం చేశారు. పాలనలో మరింత వేగం పెంచేందుకు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు యువ నాయకత్వం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.మంత్రివర్గ పదవుల కేటాయింపు మరియు విస్తరణ అనేది పూర్తిగా కాంగ్రెస్ అధిష్టానం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలోని అంశమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ విజయం కోసం, ప్రభుత్వం బలోపేతం కోసం సీఎం రేవంత్ రెడ్డి మరియు ఏఐసీసీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, శాసనసభ్యుడిగా తాను దానికి సంపూర్ణంగా కట్టుబడి ఉంటానని తెలిపారు. అధిష్టానం ఇచ్చే ఏ బాధ్యతనైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే రెడ్డిసామాజికవర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో మల్ రెడ్డి రంగారెడ్డి, బోధన్ సుదర్శన్ రెడ్డితో పాటు చాలా మంది రేసులో ఉన్నారు. కొత్తగా అనిరుథ్ రెడ్డి కూడా రేసులోకి వచ్చారు.పంచాయతీ ఎన్నికల్లో సొంత ఊరులోనూ పార్టీని గెలిపించలేకపోయిన అనిరుధ్ రెడ్డి.. పవన్ కల్యాణ్ పై విమర్శలు చేయడానికి.. ఆంధ్రా సెంటిమెంట్ రెచ్చగొట్టడానికి వివాదాస్పద కామెంట్లు చేయడంలో మాత్రం ఎప్పుడూ ముందుంటారు.

**21 ఏళ్లకే పోటీ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో సంచలనాత్మక ప్రతిపాదనతో జాతీయ స్థాయిలో సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపారు. ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉన్న కనీస వయస్సు పరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నుంచి ఒక జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆగస్టు మొదటి వారంలో తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదిస్తామని ప్రకటించారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి అడుగుపెట్టడం ద్వారా జెన్–జీ’ యువత ఐటీ, విద్యాశాఖల మంత్రులుగా, సీఎంలుగా, చివరకు ప్రధానిగా దేశాన్ని సమర్థవంతంగా నడపగలరని రేవంత్ రెడ్డి అభిప్రాయం.21 ఏళ్లకే పోటీ చేసే అవకాశం ఇవ్వడం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం.. చట్టసభల్లో యువతరానికి ప్రాతినిధ్యం పెరగడం. భారతదేశంలో జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువత ఆకాంక్షలకు, వారి సమస్యలకు తగ్గట్లు విధాన నిర్ణయాలు రూపుదిద్దుకోవడానికి ఇది దోహదపడుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , స్టార్టప్‌లు, గ్రీన్ ఎనర్జీ, గిగ్ ఎకానమీ వంటి ఆధునిక అంశాలపై 21–25 ఏళ్ల యువతకు ఉన్నంత స్పష్టమైన అవగాహన, డిజిటల్ విజన్ వయోవృద్ధులైన సాంప్రదాయ రాజకీయ నాయకులకు ఉండకపోవచ్చు. అంతేకాకుండా, 18 ఏళ్లకే ఓటు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత, పెళ్లిళ్లకు చట్టబద్ధత ఉన్నప్పుడు.. తమ నియోజకవర్గాన్ని ఏలే నాయకుడిని ఎన్నుకునే అర్హత ఉన్న యువతకు నేరుగా చట్టసభల్లోకి వెళ్లే హక్కు ఎందుకు ఉండకూడదనే వాదన అత్యంత సమంజసంగా అనిపిస్తుంది.నాణేనికి మరోవైపు చూస్తే ఇందులో కొన్ని తీవ్రమైన ప్రతికూలతలు కూడా ఉన్నాయి. 21 ఏళ్ల వయస్సు అనేది శారీరకంగా, మానసికంగా ఎదుగుతున్న కాలం. చట్టసభల్లో కోట్లాది రూపాయల బడ్జెట్ నిర్ణయాలు, సంక్లిష్టమైన చట్టాల రూపకల్పన, అడ్మినిస్ట్రేటివ్ ఒత్తిడిని తట్టుకోవడానికి రాజకీయ పరిణతి , అనుభవం అత్యంత అవసరం. ఈ వయస్సులో భావోద్వేగ నిర్ణయాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. మరో ముఖ్యాంశమేమిటంటే.. సాధారణ కుటుంబాల నుంచి వచ్చే 21 ఏళ్ల యువతకు ఎన్నికల ఖర్చులు, ప్రచారం తట్టుకోవడం అసాధ్యం. ఫలితంగా ఈ సడలింపు వల్ల నిజమైన సామాన్య యువత కంటే వంశపారంపర్య రాజకీయాలు మచేసే బడా నాయకుల పిల్లలు, వారసులు మరింత చిన్న వయస్సులోనే సులువుగా పదవులు ఆక్రమించేందుకు ఇది ఒక రెడ్ కార్పెట్ గా మారే ప్రమాదం ఉంది.ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. బ్రిటన్ , జర్మనీ, ఆస్ట్రేలియా వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 18 లేదా 21 ఏళ్లకే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంది. మన దేశంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటికే 21 ఏళ్ల వయోపరిమితి అమల్లో ఉంది. స్థానిక సంస్థల స్థాయిలో విజయవంతమైన ఈ మోడల్‌ను చట్టసభలకు విస్తరించడం ఒక రకంగా ప్రజాస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అడుగు. అయితే, కేవలం వయస్సు తగ్గించడమే కాకుండా.. నేరమయ రాజకీయాలకు దూరంగా ఉండేలా, యువతలో సరైన నాయకత్వ లక్షణాలు, సమాజంపై అవగాహన పెంచేలా శిక్షణ ఇచ్చే వ్యవస్థలు కూడా ఏర్పడాల్సి ఉంది. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన ఈ పొలిటికల్ డిమాండ్ జాతీయ స్థాయిలో యువతను ఆకట్టుకోవడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీని జెన్–జీ ప్రతినిధి గా నిలబెట్టడానికి వేసిన పక్కా స్కెచ్‌గా కనిపిస్తోంది.

# గ్రాస్ రూట్ కు దూరంగా కవిత...



హైదరాబాద్, జూలై 28, మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వినందుకే నే ఏడుస్తున్నా” అనే నానుడి తెలంగాణ రాజకీయాల్లో అచ్చం సరిపోతుంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు విన్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఇదే నిజమనిపిస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు గురించి, లాభనష్టాల గురించి లోతుగా లెక్కలు వేసుకున్న తర్వాతే కేటీఆర్ విద్యార్థులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. కానీ కవిత మాత్రం ఆ మాత్రం ధైర్యం కూడా చేయలేకపోయారు. దాదాపు నెలరోజులుగా ఢిల్లీలో విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నా, ఆ పోరాటాలు ఎంతో ఉద్రిక్తంగా మారినా ఆమె ఎప్పుడూ మొక్కుబడిగా స్పందించారే తప్ప విద్యార్థులకు నిజమైన అండగా నిలబడే ప్రయత్నం ఎన్నడూ చేయలేదుఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు పూర్తిగా ముగిసిన తర్వాత మీడియా ముందుకు వచ్చి తాపీగా మాట్లాడడం ఆమె వైఫల్యానికి నిదర్శనం. ఆ సమయంలో ఊరుకుంటే బాగుండేది కానీ ఆమె అనవసరమైన విమర్శలకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు విద్యార్థులతో కలిసి శనివారం సాయంత్రం భారీ ర్యాలీలో పాల్గొనడాన్ని ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల విజయాన్ని స్వయంగా తన ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థులు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే రేవంత్ రెడ్డి ఈ కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పోరాటాలు చేయకుండా కేవలం మాటలతో కాలక్షేపం చేసే నాయకులకు ఇటువంటి విమర్శలు చేయడం పరిపాటిగా మారింది.కాంగ్రెస్ పార్టీకి మొదట్నుంచీ విద్యార్థుల విషయంలో స్పష్టమైన వైఖరి ఉంది. ఆ పార్టీ ఎలాంటి ఉద్దేశ్యాలు కలిగి ఉన్నప్పటికీ ఈ ఆందోళనలకు బహిరంగంగానే తన సంఘీభావం తెలిపింది. పార్లమెంటు లోపల, బయట విద్యార్థుల తరపున గట్టిగా పోరాడింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఆ పార్టీ సీనియర్ నేతలు అందరూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు నిర్వహించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు కూడా ప్రత్యక్షంగా నిరసనల్లో పాల్గొన్నారు. కనుక విద్యార్థుల ఆందోళనలలో కాంగ్రెస్ పార్టీ కూడా ఒక భాగస్వామి అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కష్టకాలంలో విద్యార్థులకు అండగా ఉన్న పార్టీని ప్రశ్నించే నైతిక హక్కు కేవలం ప్రజలకోసం పోరాడే వారికే ఉంటుంది.ఈ సుదీర్ఘ ఆందోళనలకు పూర్తిగా దూరంగా ఉండిపోయిన కల్వకుంట్ల కవిత, విద్యార్థులకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని ఆక్షేపించడం చూస్తే అసలు విషయం అర్థమవుతుంది. ఈ రాజకీయ క్రెడిట్ అంతా తనకు దక్కలేదు, కేవలం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కిందనే తీవ్రమైన బాధతోనే ఆమె ఈవిధంగా మాట్లాడినట్లు స్పష్టంగా అనిపిస్తుంది. ప్రజల సమస్యల కంటే రాజకీయ లబ్ధి, క్రెడిట్ కోసమే బీఆర్ఎస్ నాయకులు పాకులాడుతున్నారనే విమర్శలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. కష్టపడి పనిచేసే వారికే ఫలితం దక్కుతుందనే కనీస సత్యాన్ని గ్రహించలేక కవిత ఇలాంటి విమర్శలు చేయడం ద్వారా తన రాజకీయ అపరిపక్వతను మరోసారి బయటపెట్టుకున్నారు.సొంత పార్టీ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఉంటుంటే, అధ్యక్షురాలి హోదాలో ఉన్న కవిత మాత్రం కేవలం మాటల గారడీకి పరిమితం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఇతరులపై బురదజల్లే సంస్కృతిని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా మార్చుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తును రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం మానేసి నిర్మాణాత్మకమైన సలహాలు ఇస్తే ప్రజలు హర్షిస్తారు. కానీ కేవలం ఈర్ష్య, అసూయలతో మాట్లాడే నాయకులకు భవిష్యత్తులో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యానాలు ఆమె రాజకీయ పరిపక్వత లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏమాత్రం ఇబ్బంది పెట్టలేవని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## 17 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులతో పాటు, ఎన్నికల్లో పోటీకి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించే ప్రతిపాదనపై చర్చించే అవకాశముంది.రైతులు, నిరుద్యోగం,సాగునీరు తదితర ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి.

## తగ్గిన బంగారం, వెండి ధరలు

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,550 తగ్గి రూ.1,32,150కి చేరింది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.750 పతనమై రూ.1,44,170 పలుకుతోంది. అటు కేజీ వెండి ధర రూ. 5,000 తగ్గి రూ.2,35,000 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతాలను బట్టి వీటి ధరల్లో స్వల్ప తేడాలు ఉండొచ్చు.

# రోడ్డు భద్రతకు ముప్పుగా మారుతున్న మైనర్ల డ్రైవింగ్

## (హెచ్.ప్రతాప్)

రోడ్డు ప్రమాదాలు దేశ అభివృద్ధికి అతిపెద్ద సామాజిక, ఆర్థిక సవాళ్లలో ఒకటిగా మారాయి. ఈ ప్రమాదాల్లో ఇటీవల ఆందోళన కలిగిస్తున్న అంశం మైనర్లు వాహనాలు నడపడం. ఇది కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు; అమాయక ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే తీవ్రమైన నిర్లక్ష్యం. డ్రైవింగ్ అనేది వాహనాన్ని కదిలించే నైపుణ్యం మాత్రమే కాదు, బాధ్యత, పరిణతి, చట్టంపై అవగాహన కలగలిపిన సామాజిక కర్తవ్యం. ఆ పరిణతి రాకముందే పిల్లలకు వాహనాల తాళాలు అప్పగించడం కుటుంబాలు, సమాజం కలిసి చేస్తున్న పెద్ద తప్పిదంగా చెప్పవచ్చు.

భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిన అ=ూణ (×త్వస్త్రతీఖ్వస =శ్ఖుస ూఎఎఅసవత్ ఞ్ఖుఎ్ఖుంవ) గణాంకాల ప్రకారం 2023–24 కాలంలో దేశవ్యాప్తంగా 11,890 రోడ్డు ప్రమాదాలు మైనర్లు వాహనాలు నడపడం వల్లే సంభవించాయి. అంటే సగటున రోజుకు 16 ప్రమాదాలు నమోదవుతున్నాయి. తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఈ ఘటనలు అధికంగా నమోదయ్యాయి.

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ తాజా నివేదిక ప్రకారం 2024లో దేశంలో 4.87 లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు, 1.77 లక్షలకు పైగా మరణాలు సంభవించాయి. అతివేగమే సుమారు 70 శాతం ప్రమాదాలకు ప్రధాన కారణంగా ఉంది. లైసెన్స్ లేకుండా, అనుభవం లేకుండా వాహనాలు నడిపే మైనర్లు ఈ ప్రమాదాలను మరింత పెంచే అవకాశం ఉంది.

పుణె, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై వంటి నగరాల్లో ఇటీవల మైనర్లు నడిపిన వాహనాల వల్ల జరిగిన ఘోర ప్రమాదాలు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. ఈ ఘటనలు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి---ఇది వ్యక్తిగత కుటుంబ సమస్య కాదు; ప్రజా భద్రతకు సంబంధించిన అంశం.

మోటారు వాహనాల చట్టం ప్రకారం మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమాని లేదా తల్లిదండ్రులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. భారీ జరిమానాలు, జైలు శిక్ష, వాహన రిజిస్ట్రేషన్ సస్పెన్షన్ వంటి నిబంధనలు ఉన్నప్పటికీ అమలు మాత్రం ప్రతిచోటా సమర్థంగా కనిపించడం లేదు. చట్టం కఠినంగా ఉండడమే కాదు, అది ఖచ్చితంగా అమలవ్వడం కూడా అంతే ముఖ్యం.

ఈ సమస్యకు పరిష్కారం కేవలం పోలీసు తనిఖీలతో సాధ్యం కాదు. తల్లిదండ్రులు పిల్లల కోరికకు లొంగి బైక్‌లు, కార్లు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై తప్పనిసరి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సీసీటీవీ ఆధారిత పర్యవేక్షణ, పునరావృత ఉల్లంఘనలపై కఠిన చర్యలు, స్థానిక సమాజం భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

ఒక మైనర్ అక్రమంగా వాహనం నడిపితే ప్రమాదంలో పడేది అతని జీవితం మాత్రమే కాదు; రోడ్డుపై ప్రయాణిస్తున్న నిరపరాధుల ప్రాణాలూ ప్రమాదంలో పడతాయి. అందువల్ల మైనర్ల డ్రైవింగ్‌ను కట్టడి చేయడం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదు, ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు నిర్వర్తించాల్సిన సామాజిక బాధ్యత కూడా.

# E20 పెట్రోల్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు

### దేశ ఆర్థిక స్వావలంబన, రైతుల ఆదాయ పెంపే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

### మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్

హైద్రాబాద్జులై 28 జు20 పెట్రోల్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ూవీ విశ్వకర్మ యోజన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా. బూర నర్సయ్య గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక ప్రయోజనాలు, రైతుల సంక్షేమం, విదేశీ చమురు



దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జు20 ఎథనాల్ బ్లెండింగ్ విధానం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

భారతదేశం ప్రతి సంవత్సరం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతుల కోసం సుమారు ?10 లక్షల కోట్ల నుంచి ?15 లక్షల కోట్ల వరకు విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. దేశంలో ఏటా సుమారు 5,600 కోట్ల లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోందని తెలిపారు.

జు20 విధానం ద్వారా పెట్రోల్‌లో 20 శాతం ఎథనాల్ వినియోగించడం వల్ల సుమారు 1,100 కోట్ల లీటర్ల ఎథనాల్ అవసరం ఏర్పడుతుందని, దీని ద్వారా ప్రతి సంవత్సరం దాదాపు ?50 వేల కోట్ల మేర విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని వివరించారు.

అదే సమయంలో ఎథనాల్ ఉత్పత్తికి అవసరమైన చెరకు, మొక్కజొన్న తదితర వ్యవసాయ పంటలకు భారీ డిమాండ్ ఏర్పడి రైతులకు సుమారు ?50 వేల కోట్ల అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా దేశానికి ఏడాదికి సుమారు ?1 లక్ష కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

జు20 పెట్రోల్ వల్ల వాహనాల ఇంజిన్లు దెబ్బతింటాయనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని డా. బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. 2023 ఏప్రిల్ తర్వాత తయారైన జు20–కంప్లైంట్ కార్లు, ద్విచక్ర వాహనాలు జు20 పెట్రోల్ వినియోగానికి అనుకూలంగా రూపొందించబడ్డాయని తెలిపారు. 2023కు ముందు తయారైన కొన్ని వాహనాల్లో మైలేజ్‌లో 3 నుంచి 5 శాతం వరకు స్వల్ప తగ్గుదల ఉండే అవకాశం ఉందని, అయితే అది కూడా వాహనం, ఇంజిన్ నమూనాను బట్టి మారుతుందని చెప్పారు. ఈ కారణంగా దేశవ్యాప్తంగా ఏడాదికి సుమారు ?2,000 కోట్ల నుంచి ?3,000 కోట్ల వరకు మాత్రమే అదనపు ఇంధన వ్యయం ఉండొచ్చని, కానీ దేశానికి మాత్రం సుమారు ?1 లక్ష కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

దేశ ఆర్థిక స్వావలంబన, రైతుల సంక్షేమం, ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానాన్ని ప్రజలు( Gen A to Z) సరైన కోణంలో అర్థం చేసుకోవాలని డా. బూర నర్సయ్య గౌడ్ కోరారు. అలాగే, జు20 విధానంపై కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా శ్రీ రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని ఆయన ఆరోపించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక విధానాలపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదని అన్నారు. భారతదేశ భవిష్యత్తు, రైతుల సంక్షేమం, విదేశీ చమురు దిగుమతుల తగ్గింపు వంటి జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు వాస్తవాలను తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### మణుగూరు గని సింగరేణికే దక్కాలి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలోని పీకేఓసీ డీప్‌సైడ్ ఎక్స్ టెన్షన్ బ్లాక్ వేలం నుంచి తెలంగాణ జెన్?కో తప్పుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. జెన్?కో తప్పుకుంటే సింగరేణికే ఆ గని దక్కుతుందని, సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. నైనీ, తాడిచర్ల ?2 బ్లాక్‌లను కేంద్రం ఇప్పటికే సింగరేణికి కేటాయించిందని, మణుగూరు కూడా దక్కితే సంస్థకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. 6,500 మందికి ఉపాధి, 830 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందన్నారు. రూ.లక్షా 95 వేల కోట్ల టర్నోవర్, రూ.40 వేల కోట్ల లాభం వస్తుందని తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితునికి వెస్సో సాయం



హైద్రాబాద్ జులై 28: విజయవాడ రూరల్ నివాసి తాడేపల్లికి చెందిన వృత్తి రీత్యా వడ్రంగిగా పని చేస్తూన్న అద్దంకివెంకటాచారి(64) విధి నిర్వహణ లో భాగంగా కంపెనీ పని పై బైక్ పై వెళ్తుండగా రాజ్ కుమార్ ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.

దురదృష్టవశాత్తు, మొదటి నెల జీతం కూడా అందుకోక ముందే..తలకు తీవ్ర గాయాలై, 2026 మే 4 నుండి ఇప్పటివరకు 9 శస్త్ర చికిత్సలు చేయించు కున్నాడు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ ఇంకా చికిత్స కొనసాగించ వలసిన అవసరం ఉంది! ఇప్పటి వరకు సుమారు 21 లక్షల వైద్య ఖర్చులు అయ్యాయరు.

ప్రస్తుతం కుటుంబం పూర్తిగా ఆర్థికంగా చితికిపోయి, తదుపరి చికిత్సకు ఎలాంటి మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఎన్టీఆర్ జిల్లా నాయకులు పెంట సాయి కిరణ్ ద్వారా రాజ్ కుమార్ తల్లిదండ్రులు వెస్సో ట్రస్ట్ ను సంప్రదించి, తమ కుమారుని చికిత్స కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించ వలసినదిగా అభ్యర్థించారు. స్పందించిన వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో వెంకటాచారికి 61,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ
కుమారుని చికిత్స కొరకు ఉన్నదంతయు అమ్ముకొని, ఎటువంటి ఆధారం లేని పరిస్థితిలో తండ్రి వెంకటాచారికి సమయానికి సహాయపడి ఆదుకున్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# మహేశ్వరం నియోజకవర్గం TRS పార్టీ ఇంచార్జిగా కోల శ్రీనివాస్ నియామకం



హైదరాబాద్, జూలై28 ; తెలంగాణ రక్షణ సేన ుూ పార్టీ వ్యవస్థాపక అధినేత్రి కల్వకుంట్ల కవిత మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బడంగ్‌పేట్ నివాసి కోల శ్రీనివాస్ కు మహేశ్వరం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కోల శ్రీనివాస్
బీసీ సామాజికవేత్త& తెలంగాణ ఉద్యమ నేత,30 సంవత్సరాల రాజకీయ అనుభవం
గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన నాయకుడు
తెలంగాణ వీదీజ సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుల
పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు
Lions Club District Chairman
ప్రజల్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలు తీర్చే బహుజన బిడ్డ
పార్టీ నిర్మాణానికి పూర్తి సమయం కేటాయించి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు

ఈ సందర్భంగా కోల శ్రీనివాస్ మాట్లాడుతూ – "ఇన్ని ఉద్యమాలు చేసిన, జెండా పట్టే కార్యకర్తలన్నీ చూసిన ుూ పార్టీలోనే ఎమ్మెల్యే స్థాయి పదవి ఒక సాధారణ కార్యకర్తకు రావడం కవితక్క గారికే సాధ్య మన్నారు. జాతీయ పార్టీలలో ఇలాంటి పదవులు, నామినేటెడ్ పోస్టులు కార్యకర్తలకు రావు. ప్రాంతీయ పార్టీగా ఏర్పడ్డ ుూ పార్టీ రాబోయే రోజుల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, కల్వకుంట్ల కవితక్క కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారు అని వివరించారు.

"ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అందరి పార్టీగా ఈరోజు ఆదరణ పొందుతున్న TRS పార్టీ – ఎక్కడ అన్యాయం ఉన్నా అక్కడ న్యాయం జరిగే వరకు పోరాడే పార్టీ" అని కోల శ్రీనివాస్ గారు స్పష్టం చేశారు.

# శాతవాహన లో ఆర్థిక శాస్త్రంలో కంప్యూటర్ అనువర్తనాలు


### విద్యార్థులకు డిజిటల్ నైపుణ్యాలు అంశంపై ఒకరోజు కార్యశాల

### కార్యశాలల వలన మెరుగైన పాఠ్య విజ్ఞానం

### – ఆచార్య ఉమేశ్"

కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆర్థిక శాస్త్రంలో కంప్యూటర్ అనువర్తనాలు: విద్యార్థులకు డిజిటల్ నైపుణ్యాలు" అనే అంశంపై మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో ఒకరోజు కార్యశాల విద్యా సాధికారత కార్యక్రమంలో భాగంగా అధ్యక్షత వహించిన ఆర్ట్స్, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కే. పద్మావతి మాట్లాడుతూ వివిధ రకాల నైపుణ్యాల ప్రయోగాల ద్వారా పరిణితి సాధించాలని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య . యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో డిజిటల్ నైపుణ్యాలు ప్రతి విద్యార్థికి అత్యంత అవసరమని, తద్వారా ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక శాస్త్ర విద్యార్థులకు ఆధునిక డిజిటల్ సాంకేతికతలను పరిచయం చేయడం ద్వారా పరిశోధన, డేటా విశ్లేషణలో ఎక్సెల్ సాఫ్ట్వేర్ ను ఉపయోగించి ఉత్తమ ఫలితాలను రాబట్టవచ్చని విశ్లేషించారు. కార్యశాల కన్వీనర్ డాక్టర్. కే. శ్రీవాణి మాట్లాడుతూ ప్రైవేటీకరణ,ప్రపంచీకరణలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు భవిష్యత్తులో ఆర్థిక శాస్త్రంలో కంప్యూటర్ అనువర్తనాలను ఉపయోగించి పరిశోధనలలో మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని వివరించారు.నాలుగు అంశాలపై ఏర్పాటు చేసిన కార్య శాలలో విద్యార్థులకు ఎంఎస్ ఆఫీసు, డేటా విశ్లేషణ, గ్రాఫ్‌లు, చార్టుల తయారీ, ఆర్థిక గణాంకాల ప్రాథమిక విశ్లేషణ, ఇంటర్నెట్ ఆధారిత నైపుణ్యాలు కృత్రిమ మేధస్సు వినియోగం మొదలగు డిజిటల్ సాధనాల వినియోగం గురించి రిసోర్స్ పర్సన్స్ ఆచార్య .జి. రామకృష్ణ, ఆచార్య . ఎం. వరప్రసాద్, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, డాక్టర్. కే. శ్రీవాణి ,అర్థశాస్త్ర విభాగపు అధిపతి, వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించి ప్రాక్టీస్ చేయించారు.ఈ కార్యక్రమంలో విసి ఓ ఎస్ డి డాక్టర్. డి.హరికాంత్, కోఆర్డినేటర్ అకాడమిక్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం డాక్టర్. ఎన్. వి. శ్రీరంగ ప్రసాద్, ఆర్ట్స్ అండ్ లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అబ్రర్ ఉల్ బాకీ, కార్యశాల కో కన్వీనర్ డాక్టర్. డి. సత్యనారాయణ, డాక్టర్ .కే. విద్యాసాగర్ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో వర్క్ షాప్ లో పాల్గొన్న విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు.

## రెండు రోజులు భారీ వర్షాలు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




Five Day Forecast and Farmer's Weather Bulletin for TELANGANA STATE
ISSUED AT 1300 HRS IST (MID-DAY) ON 28-07-2026

| | Date | | WEATHER FORECAST & WARNINGS |
|---|---|---|---|
| DAY 1 | From: 1300 hrs of 28/07/2026 To: 0830 hrs of 29/07/2026 | Forecast | Light to Moderate Rain or Thundershowers very likely to occur at MANY places over Telangana. |
| | | Warning | **Heavy Rainfall** very likely to occur at isolated places in Adilabad, KomuramBheem Asifabad, Mancherial, Nirmal, Nizamabad, Jagtial, Rajanna Sircilla, Karimnagar, Peddapalli, Jayashankar Bhupalpally, Mulugu, Bhadradri Kothagudem, Vikarabad, Sangareddy, Medak, Kamareddy districts of Telangana. **Thunderstorm accompanied with Lightning and Gusty Winds (30-40 kmph)** very likely to occur at isolated places in Khammam, Nalgonda, Suryapet, Mahabubabad, Warangal, Hanumakonda, Jangaon, Siddipet, Yadadri Bhuvanagiri, Rangareddy, Hyderabad, Medchal-Malkajgiri, Mahabubnagar, Nagarkurnool, Wanaparthy, Narayanpet, Jogulamba Gadwal districts of Telangana. **Strong surface winds upto (30-40 kmph)** very likely to prevail at isolated pockets in ALL districts of Telangana. |
| DAY 2 | From: 0830 hrs of 29/07/2026 To: 0830 hrs of 30/07/2026 | Forecast | Light to Moderate Rain or Thundershowers very likely to occur at a FEW places over Telangana. |
| | | Warning | **Heavy Rainfall** very likely to occur at isolated places in Adilabad, KomuramBheem Asifabad, Mancherial, Nirmal, Nizamabad, Jagtial, Vikarabad, Sangareddy, Medak, Kamareddy districts of Telangana. **Strong surface winds upto (30-40 kmph)** very likely to prevail at isolated pockets in ALL districts of Telangana. |
| DAY 3 | From: 0830 hrs of 30/07/2026 To: 0830 hrs of 31/07/2026 | Forecast | Light to Moderate Rain or Thundershowers very likely to occur at ISOLATED places over Telangana. |
| | | Warning | **Strong surface winds upto (30-40 kmph)** very likely to prevail at isolated pockets in ALL districts of Telangana. |
| DAY4 | From: 0830 hrs of 31/07/2026 To: 0830 hrs of 01/08/2026 | Forecast | Light to Moderate Rain or Thundershowers very likely to occur at ISOLATED places over Telangana. |
| | | Warning | **Strong surface winds upto (30-40 kmph)** very likely to prevail at isolated pockets in ALL districts of Telangana. |

**పెద్దపల్లి, జూలై – 28, ప్రజాబలం ప్రతినిధి** :వాతావరణ నిపుణులు, క్లైమటాలజిస్టులు అందించిన నివేదికల ప్రకారం పెద్దపల్లి జిల్లాలో జూలై 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కంది, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు, అలసంద, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు వంటి పంటలను సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనాలు వేసేందుకు అత్యంత అనుకూల సమయమని, జిల్లా కలెక్టర్ సూచించారు. సకాలంలో విత్తనాలు వేయడం వల్ల నేలలో తగినంత తేమ లభించి పంటలు ఆరోగ్యంగా ఎదిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆగస్టు 10 వరకు మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ అవి చెరువులు నిండేందుకు, భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపయోగపడవని, వీటిని నమ్ముకుని వరి వంటి పంటలు వేస్తే రైతులు దెబ్బతింటారని ఆరుతడి పంటల సాగుకే రైతులు మొగ్గు చూపాలని కలెక్టర్ సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ఈ అనుకూల వర్షాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# దేశంలోనే స్కూళ్ల ఫీజుల్లో హై'డర్' బాద్

హైద్రాబాద్, జూలై 28, హైదరాబాద్‌లో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల మోత మోగుతోంది. ఎలాంటి నిబంధనలు లేకుండా పాఠశాలలు 40 శాతం నుంచి 100 శాతం వరకు ఫీజులను పెంచుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు. ఫీజుల పెంపుపై దేశవ్యాప్తంగా అత్యధిక ఫిర్యాదులు హైదరాబాద్ నుంచే వస్తున్నట్లు తెలిపింది. గృహ రుణ ఈఎంఐలతో సమానంగా మారుతున్న స్కూల్ ఫీజుల వల్ల విద్య మధ్యతరగతికి భారంగా మారుతోందని, ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు పెంచితేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.ఒకప్పుడు విద్య అంటే జ్ఞాన దానం.. నేడు విద్య అంటే లాభసాటి వ్యాపారం. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు చదువును ఒక సేవగా కాకుండా.. లాభాలు తెచ్చిపెట్టే వ్యాపారంగా మార్చేశాయి. ఫీజుల మోత, డొనేషన్ల బాదుడు, పుస్తకాలు–యూనిఫాంల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతూ అడ్డగోలుగా దోచుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో.. ఫీజులకి సంబంధించిన ఫిర్యాదులలో హైదరాబాద్ దేశంలోని అగ్రశ్రేణి నగరాలలో ఒకటిగా నిలిచింది. ఇతర మెట్రో నగరాలలో ఫీజుల పెరుగుదల సాధారణంగా 10 నుంచి 30 శాతం వరకు ఉండగా.. హైదరాబాద్‌లో మాత్రం ఎలాంటి నిబంధనలు లేకపోవడం వల్ల కొన్ని ప్రైవేటు స్కూళ్లు ఏకంగా 40 నుంచి 50 శాతం మేర, కొన్ని సందర్భాల్లో 100 శాతం వరకు ఫీజులను పెంచుతున్నాయని ఇండియన్ వెబ్ ఆఫ్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనుభా సహాయ్ వెల్లడించారు.

హైదరాబాద్‌లోని మెజారిటీ తల్లిదండ్రుల నుంచే తమకు అత్యధిక ఫిర్యాదులు అందుతున్నాయని, బెంగళూరు రెండో స్థానంలో ఉందని ఆమె తెలిపారు.చాలా కుటుంబాలకు పాఠశాల విద్య ఖర్చులు హోమ్ లోన్ ఈఎంఐలను తలపించేలా భారంగా మారుతున్నాయన్నారు. ఇటీవల కెనడా నుంచి నగరానికి తిరిగి వచ్చిన ఓ మహిళ మాట్లాడుతూ.. తన ఏడేళ్ల కూతురి స్కూల్ ఫీజు గురించి ఆశ్చర్యకర విషయాలు వెల్లడించారు. ట్రాన్స్‌పోర్టుతో కలుపుకొని ఏడాదికి రూ. 3 లక్షలకు పైగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. తమ ఇంటి లోన్ ఈఎంఐ రూ. 40 వేలు ఉంటే, కూతురి స్కూల్ నెలకు ఫీజు రూ. 22 వేల వరకు ఉందని, 10 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఫీజులు ఇంతరా పెరిగిపోవటం తనను ఆశ్చర్యపరిచిందని ఆమె వెల్లడించారు. ఫీజులు విపరీతంగా ఉండటం వల్లే తాము కేంబ్రిడ్జ్ సిలబస్ బదులుగా సీబీఎస్ఈని ఎంచుకోవాల్సి వచ్చిందని చెప్పారు.తమ పిల్లల ఫీజులను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఒక్కసారిగా భారీగా పెంచేసిందని పేట్‌బషీరాబాద్‌కు చెందిన మరో మహిళ వాపోయారు. గతేడాది ప్రైమరీ చదువుతున్న ఇద్దరు పిల్లలకు వరుసగా రూ. 23 వేలు, రూ. 22 వేలు చెల్లిస్తే.. ఈ ఏడాది ఆ ఫీజులు రూ. 40 వేలు, రూ. 58 వేలకు పెంచినట్లు తెలిపారు. రసీదుల ఆధారంగా ఒకరి ఫీజు సుమారు 74 శాతం పెరిగితే.. మరో అబ్బాయికి ఏకంగా 164 శాతం పెరిగిందని దీనివల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు.ఈ రకమైన ధోరణి కారణంగా విద్య అప్పర్ మిడిల్ క్లాస్ మినహా ఇతరులకు అందని ద్రాక్షలా మారుతోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, విద్యావేత్త ఆకునూరి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది కుటుంబాలు తమ నెలవారీ ఆదాయంలో 50 శాతాన్ని స్కూల్ ఫీజులకే ఖర్చు చేస్తున్నాయని, మంచి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే ఉద్దేశంతో గిగ్ కార్మికులు కూడా రెట్టింపు కష్టపడి సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వాలు విద్యకు తక్కువ బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే ప్రజలు ప్రైవేట్ స్కూళ్ల వైపు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ విద్యా కమిషన్ సూచనలు అమలవకపోవటం దురదృష్టకరమని అన్నారు.పాఠశాలలను ప్రశ్నిస్తే తమ పిల్లలను టార్గెట్ చేస్తారనే భయంతో చాలా మంది తల్లిదండ్రులు మౌనంగా ఉంటున్నారని అనుభా సహాయ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు పరిమితంగా ఉండటం, అందరికీ కేంద్రీయ విద్యాలయాల్లో సీట్లు రాకపోవడం వల్ల ప్రత్యామ్నాయాలు కరువయ్యాయని పేర్కొన్నారు. అలాగే.. హైదరాబాద్‌లోని అనేక అంతర్జాతీయ పాఠశాలలు ఫీజుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచకుండా పారదర్శకతను విస్మరిస్తున్నాయని హైదరాబాద్ ప్రైవేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి బీవీకే కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే సామాన్యుల పిల్లలు చదువుకు దూరం కావాల్సిందేనని హెచ్చరించారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మద్దికేర మండల పరిధిలోని గల మొలగవల్లి రహదారి సమీపంలో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభించిందని మద్దికేర ఎస్సై హరిత తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్దికెర?మొలగవల్లి రహదారిలోని శారదమ్మ పొలానికి తూర్పు వైపున ఉన్న కరువు పని గుంతలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు మద్దికెర ఈస్ట్ వీఆర్వో రంగస్వామి సమాచారం ఇవ్వడంతో వీఆర్వో రంగస్వామితో పాటు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా సదరు మృతురాలి వయస్సు సుమారు 70?75 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, మృతదేహం ఇప్పటికీ సుమారు ఆరు రోజుల క్రితమే సహజముగా మృతి చెందినట్లు కనిపించగా,శరీరంలోని కొన్ని భాగాలు అడవి జంతువుల వల్ల దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు ఎస్ఐ హరిత తెలియజేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలియజేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా మద్దికెర పోలీస్ స్టేషన్ 9121101130 నంబర్ కు సమాచారం అందించాలని మద్దికేర ఎస్సై హరిత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్దికేర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

### లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ కాపా మురళి కృష్ణ
### విప్పలమడకకు ఫ్రీజర్ బాక్స్ వితరణ
### చేతిపంపు ప్రారంభోత్సవం బ్యాగ్స్ పంపిణీ

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 28 ప్రజాబలం:**సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే వైరా లయన్స్ క్లబ్ లక్ష్యమని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్, కాంగ్రెస్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాపా మురళికృష్ణ అన్నారు. వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాపా మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా వైరా మండలంలోని విప్పలమడక గ్రామానికి మంగళవారం ఫ్రీజర్ బాక్స్ ను ఉచితంగా ఇచ్చారు. అదేవిధంగా విప్పలమడక గ్రామంలోని ఎస్సీ స్మశాన వాటికలో ఏర్పాటుచేసిన చేతిపంపును, ఫ్రీజర్ బాక్స్ భద్రపరిచేందుకు నిర్మించిన గదిని కాపా మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా





మేడా సంపత్ అధ్యక్షతన జరిగిన సభలో కాపా మురళీకృష్ణ ప్రసంగించారు. వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విప్పలమడక గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవతోనే మానవక జన్మకు సార్ధకత లభిస్తుందని చెప్పారు. తన జన్మదినం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. మేడా శంకరయ్య – సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విప్పలమడకలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా గ్రామంలోని సిఎస్ఐ చర్చిలో మురళీకృష్ణ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామస్తులు మురళీకృష్ణకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు అనంతరం బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు పిల్లలకు బ్యాగ్స్ అందించారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా జిఈటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు, ఎల్సిఎఫ్ఐ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు, జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్, రీజనల్ సెక్రెటరీ వై బుచ్చిరామారావు, రీజియన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు వైరాకుల అధ్యక్షులు కొల్లా రాంబాబు జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావు విప్పలమడక మాజీ సర్పంచ్లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జానుపాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, సోమలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వీరపనేని చెన్నకేశవరావు, ఉప సర్పంచ్ బూర్గ లూర్దమ్మా, న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భుమేశ్వరరావు, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, కాంగ్రెస్ గ్రామ అధ్యకుడు కొల్లికొండ వీరభద్రరావు, లయన్స్ క్లబ్ సభ్యులు చింతోజు నాగేశ్వరరావు,ఎపూరి రాజారావు చింతలపూడి వెంకటేశ్వరరావు, ఉయ్యూరు రామకృష్ణ, గంగవరపు కిషన్,



పువ్వాడ రాము, వార్డు సభ్యులు ముత్తమాల నాగజ్యోతి, పారుపల్లి నిఖిత, ముత్తమాల దేవానందం, కాశిమాల సామేలు, బూర్గు నందిని, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భీమేశ్వర ఆలయంలో వికలాంగ భక్తురాలికి ప్రత్యేక దర్శనం




**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 28:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి ఆలయ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సందర్భంగా మానవత్వాన్ని చాటారు.కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనానికి వచ్చిన ఓ వికలాంగ మహిళను గుర్తించిన ఈవో రమాదేవి, ఆమెకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమెకు ప్రత్యేకంగా శ్రీ భీమేశ్వర స్వామివారి దర్శనం కల్పించి, సౌకర్యవంతంగా దర్శనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు.అనంతరం వికలాంగ మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు ఆలయ ఆధ్వర్యంలో భోజన సదుపాయాన్ని కూడా కల్పించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం, ఇతర సేవలు అందించేందుకు దేవస్థానం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఆలయ అధికారులు తెలిపారు.ఈవో రమాదేవి చూపిన చొరవపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాలికను కాపాడిన ఆర్టీసీ

,ఒక ఆర్టీసీ బస్సు (మిధాని డిపో) కండక్టర్ (శేఖర్), డ్రైవర్ (జె.ఎస్.కుమార్) చొరవ ఒక విద్యార్థిని కాపాడింది.పటాన్ చెరువులోని తెలంగాణ మైనారిటీ గురుకులం విద్యార్థిని అనూహ్యంగా పటాన్ చెరువు వద్ద ఆర్టీసీ బస్సు (నెం.218) ఎక్కింది.చేతిలో పది రూపాయల నోటు తప్ప ఆ బాలిక వద్ద ఏమి లేవు, కాళ్లకు చెప్పులు కూడా లేవు కండక్టర్ టికెట్ అడిగినప్పుడు దీనంగా అదోరీతిలో చూసింది. కండక్టర్కు అనుమానం వచ్చింది, విషయన్ని డ్రైవర్ కు చెప్పాడు, ఇద్దరూ ఆ అమ్మాయిని కనిపెడుతూనే ఉన్నారు. పక్కన ఉన్న ప్యాసింజర్ వద్ద ఫోన్ తీసుకొని ఆ అమ్మాయి ఎవరికో మాట్లాడింది ఆ నెంబర్ ఆధారంగాఆఅమ్మాయి మైనారిటీ గురుకులం విద్యార్థిగా నిర్ధారణ అయింది. దాంతో తోటి ప్రయాణికులకు చెప్పడంతో ఆఅమ్మాయి వెనుక నుంచి కదులుతున్న బస్సులోంచి దిగేందుకు ప్రయత్నించింది ప్రయాణికులు అందరూ ఆమెను పట్టుకొని, సముదాయించి చివరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో అప్పగించడం జరిగింది.

# శాసనసభ హామీల అమలు కమిటీ సభ్యుడిగా బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తా

## అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ

**చంద్రుగొండ జులై 28 ప్రజాబలం ప్రతినిధి :-** తెలంగాణ శాసనసభలో ఏర్పాటైన వివిధ కీలక కమిటీల తొలి సమావేశాలు మంగళవారం శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో జరిగాయి ఈ సమావేశాలకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై కమిటీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు ప్రభుత్వ హామీల అమలు కమిటీ సభ్యుడిగా ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు సకాలంలో అమలయ్యేలా తన వంతు బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు ప్రజల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు ఈ సందర్భంగా గిరిజన శాసనసభ్యుడైన తనకు ప్రభుత్వ హామీల అమలు కమిటీలో అవకాశం కల్పించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పార్టీ అధిష్ఠానానికి సంబంధిత నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఈ అవకాశం ద్వారా గిరిజనులు గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మరింత బలంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించిందన్నారు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా నియోజకవర్గ అభివృద్ధి గిరిజనుల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్పష్టం చేశారు.



# వర్షాకాలంలో అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి

**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-28, ప్రజాబలం ప్రతినిధి :** నగరపాలకసంస్థ , వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా కృషిచేసి ఈ వర్షాకాలంలో అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. మంగళ వారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అంటువ్యాదుల నివారణా చర్యలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆద్వర్యంలో గత మూడు నెలలుగా స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ చేపట్టడం జరుగుతున్నదని అన్నారు . డ్రై డే ఫ్రై డే , ఫాగింగ్ , యాంటీ లార్వా స్ప్రే , లీకేజీల మరమ్మత్తు , త్రాగు నీటి క్లోరినేషన్ , నీరు నిల్వకుండా చూడడం తదితర అన్ని చర్యలు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. హోటళ్లు, వీధి వ్యాపారుల వద్ద నిల్వ ఉంచిన, కలుషితమైన ఆహార పదార్థాల అమ్మకాలను అరికట్టడానికి కూడా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని అన్నారు. వ్యాధుల నివారణపై నగర పాలక సంస్థ తో పాటు వైద్య ఆరోగ్యశాఖ కూడా అంతే అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో ఔషధాలు , లాబ్ కిట్లు సరిపడా ఉంచుకోవాలని అన్నారు. జవరా సర్వే లు పకడ్బందీగా నిర్వహించడంతో పాటు తరచుగా డివిజన్ లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రామగుండం నగరాన్ని మెడికల్ హబ్ గా తీర్చిదిద్దడానికి ఎంఎల్ఏ రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని అన్నారు . ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని పెంచడంతో పాటు పెద్ద నగరాలకు పరిమితమైన క్యాత్ ల్యాబ్ కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగి ప్రజలు వ్యయ ప్రయాస లకు గురి కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యశీ అందించాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ సమయం లోనైనా స్పందించేందుకు సిద్దంగా ఉండాలని అన్నారు.





అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఖాళీ ప్లాట్లను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సదరు యజమానులకు నోటీసులు జారీ చేశామని అన్నారు. సానిటేషన్ జవాన్లు , పి హెచ్ సి హెల్త్ సూపర్ వైజర్ లు సంయుక్తంగా సర్వే చేసి లోతట్టు ప్రాంతాలు , నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు గుర్తించి నివేదిక సమర్పిస్తే తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ ఎం ఓ కృపా భాయ్ , పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు మాణికేశ్వర్ రెడ్డి , నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్, ఎ సి పి శ్రీహరి , డి ఇ శాంతి స్వరూప్ , టి పి ఓ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ వార్షిక తనిఖీ -- మల్లారెడ్డిపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం.



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 28** వీణవంక పోలీస్ స్టేషన్‌లో సహాయ పోలీస్ కమిషనర్ (ఏసిపి) వి.మాధవి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని నేరాల రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, మాల్ఖానా, శాంతిభద్రతల పరిస్థితి, ప్రజలకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని ఏసీపీ పేర్కొన్నారు. అనంతరం వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏసీపీ ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, ప్రజల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ మరియు అత్యవసర పరిస్థితుల్లో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు జరగాలని పిలుపునిచ్చారు. పోలీసులకు ప్రజలు సహకరిస్తే శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్, వీణవంక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఆవుల తిరుపతి పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# సెక్యూరిటీ గార్డ్ కి రావలసిన వేతనం ఇప్పించిన.. రవి సింగ్




**కూకట్పల్లి (ప్రజాబలం )జులై 28:** జీడిమెట్ల ఇండస్ట్రీలోని శ్రీ శివశక్తి మేనేజ్మెంట్ సెక్యూరిటీ సర్వీస్ లో" సెక్యూరిటీ గార్డ్ కృష్ణారావు అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాలుగా పని చేయడం జరుగుతుంది. ఏ కారణం లేకున్నా కానీ వేతనం ఇవ్వకుండా, సెక్యూరిటీ కృష్ణారావు నీ డ్యూటీలో నుంచి తీసివేయడం జరిగింది కృష్ణారావు గత సంవత్సరం డిసెంబర్ నెల వేతనం ఉండగా అవి ఇవ్వకుండా, ఏదో రకంగా నిర్లక్ష్యం చేస్తూ సెక్యూరిటీ గార్డ్ కృష్ణారావుని ఇబ్బంది పెడుతూ పంపించేవారూ, కార్మికుడు కృష్ణారావుకి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి సెక్యూరిటీ కార్మికుల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అతని గురించి తెలుసుకొని రవి కార్యాలయం వద్దకు వెళ్లి సెక్యూరిటీ గార్డ్ కి జరిగిన అన్యాయం చెప్పుకున్నారు.. ఆ తర్వాత వెంటనే స్పందించిన, రవి హుటాహుటిన, శ్రీ శివశక్తి మేనేజ్మెంట్ సెక్యూరిటీ సర్వీస్ వద్దకు వెళ్లి సెక్యూరిటీ గార్డ్ కృష్ణారావు కి రావలసిన వేతనం గురించి పలుమార్లు చర్చించి, మొత్తం, గత సంవత్సరం ఒక్క నెల డిసెంబర్ వేతనం ఇప్పించడం జరిగింది సెక్యూరిటీ గార్డ్ కృష్ణారావు మాట్లాడుతూ మాకు మా కుటుంబ సభ్యులకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి మా తరపున, మా కుటుంబ సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, సుదర్శన్, జగన్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# సండ్ర వెంకట వీరయ్య విమర్శలు మానుకోవాలి కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 28:** మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కాంగ్రెస్ పార్టీ, సత్తుపల్లి నియోజకవర్గ నాయకత్వంపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సత్తుపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే అవాస్తవ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం గానీ, ఒక్క రుణం గానీ అర్హులకు అందించలేదని, తల్లాడ మండలంలో రూపే కార్డుల పేరుతో రైతులను దోచుకున్న ఘటనలను ప్రజలు మరచిపోలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉపాధి అవకాశాలు, రుణాలు, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల తీర్పుతోనే మాజీ ఎమ్మెల్యేను ఓడించారని, ఇకపై కాంగ్రెస్ పార్టీ లేదా నాయకులపై అసత్య ఆరోపణలు, అవాకులు-చవాకులు చేస్తే సహించబోమని హెచ్చరించారు. రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ నాయకులు అన్నారు.

# ఫార్మర్ ఐడి కోసం అన్నదాతలు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

### అందుబాటులో లేని రైతు సేవా కేంద్రం సిబ్బంది ఇబ్బందుల్లో అన్నదాతలు

హోళగుంద, :మండలంలో రైతులు ఫార్మర్ ఐడి కోసం అన్నదాతలు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంగళవారంరైతన్నలు ఫార్మర్ ఐడి కోసం మూడు రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పంట ఇన్సూరెన్స్ కావాలంటే తప్పనిసరిగా ఫార్మర్ ఐడి ఉండాలని నెట్ సెంటర్లో చెపుతున్నారు. కావున మండల స్థాయి అధికారులు స్పందించి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వందవాగలి,నేరనికి లింగంపల్లి గ్రామాల రైతులు కోరారు.

# రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం ధర్నా



**జహీరాబాద్, జూలై 28 ప్రజాబలంప్రతినిధి:** జహీరాబాద్--హోతి(కే)--శేఖాపూర్ మీదుగా తాండూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు ఎస్. మహిపాల్ మాట్లాడుతూ, పూర్తిగా దెబ్బతిన్న రహదారిపై వెంటనే కొత్త రోడ్డు నిర్మించాలని, అప్పటి వరకు గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారిలోని గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందన్నారు.

వారంలోగా సమస్యను పరిష్కరించి అవసరమైన మరమ్మతులు చేపడతామని ఆర్‌అండ్‌బీ ఏఈ హామీ ఇచ్చారు. హామీ అమలు కాకపోతే ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు రహదారి దిగ్బంధం చేపడతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ధర్నాలో ప్రజలు, కార్మికులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

# బాలిక అదృశ్యం.. కేసు నమోదు



**జహీరాబాద్, జూలై 28 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి అక్షయ (12) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బాలిక తండ్రి తమ్మిశెట్టి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఎస్సై లవ కుమార్ తెలిపిన ప్రకారం అక్షయ ఇంటి నుంచి నీళ్లు తీసుకువస్తానని బిందె తీసుకుని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు వెంటనే జహీరాబాద్ టౌన్ ఎస్సై 8712656763,సీఐ 8712656731 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం అందజేస్తామని తెలిపారు.

## రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ సైదా

జహీరాబాద్, జూలై 28 ప్రజాబలం ప్రతినిధి: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతంగా జీవించాలని జహీరాబాద్ డీఎస్పీ సైదా సూచించారు. హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన రౌడీ మేళాలో ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, చట్టాన్ని గౌరవిస్తూ శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్ల వివరాలను క్షుణ్ణంగా ధ్రువీకరించి రికార్డులను నవీకరించారు. ఇప్పటివరకు వేలిముద్రలు నమోదు కాని రౌడీషీటర్ల బయోమెట్రిక్ (వేలిముద్రల) నమోదును పూర్తి చేశారు. ప్రతి ఒక్కరి ప్రస్తుత చిరునామా, వ్యక్తిగత వివరాలను పరిశీలించి రికార్డులను అప్‌డేట్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి గుర్తించదగిన నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉండాలని, నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, హద్నూర్ ఎస్సై సుజిత్, రాయికోడ్ ఎస్సై చైతన్య కిరణ్ పాల్గొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగ పరుచుకొండి



**గండిపేట ప్రజాబలం ప్రతినిది 28 జులై 2026**రాజ్యాంగ బద్ధమైన ప్రాథమిక ఓటు హక్కును సద్వినియోగ పరుచు కోవాలంటే డిజిటలైజేషన్ ప్రక్రియకు తోడ్పడాలీ, అందుకు గాను మేము తలపెట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరం మంగళవారం రోజున పుప్పాలగుడ దుర్గా నగర్ లో తలపెట్టగా, విచ్చేసిన మణికొండ, నెక్నంపూర్ డివిజన్ పురజనులకు వారి ఓటు వివరాలు కలిగిన బూతులెవల్ అధికారి సమాచారం, ఎన్యూమరెశన్ ధరకాస్తూ ఫారం పూరించడం, 2002 లో వారి యొక్క లేదా వారి పరివారం సభ్యుల ఓటు వివరాలను తెలిపి మ్యాపింగ్ చేయడంలో సంపూర్ణ సహకారన్ని అందించడ మైనదని బి ఆర్ ఎస్ పార్టీ స్థానిక నాయకులు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, సుమ నలిని, సుమన్, దేవిప్రియ, షేక్ ఆరీఫ్ తదితరులు తెలిపారు.

# బిఎల్ఎ నియోజకవర్గ ఇంచార్జ్ రాయల రామును అభినందించిన ఎమ్మెల్యే



**ఖమ్మం/తల్లాడ జులై 28 ప్రజాబలం:**సత్తుపల్లి నియోజకవర్గ బిఎల్ఎ సమీక్ష సమావేశం మంగళవారం సత్తుపల్లి సిద్ధారం రోడ్ లోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు మట్ట రాగమయి హాజరై బిఎల్ఏల పనితీరు గురించి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం ఖమ్మం జిల్లాలోని రెండో స్థానంలో నిలిచిందని దీనికి కారణమైన సత్తుపల్లి బిఎల్ఎ ఇంచార్జ్ రాయల రామును ప్రత్యేకంగా అభినందించారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ఈ కార్యక్రమం విజయవంతం కావటానికి సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# 130 మంది విద్యార్థులకు ముగ్గురే ఉపాధ్యాయులు

## ఒక ఉపాధ్యాయుడు మీటింగ్లో ఉంటాడు మరొక ఉపాధ్యాయుడు డిప్రెషన్లో ఉంటాడు విద్య బోధించేది ఒకరె ఉపాధ్యాయుడు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 28 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అల్లాదుర్గం మండల పరిధిలోని ముస్లాపూర్, ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య130, మంది విద్యార్థులు ఉన్నారు, కానీ ఇక్కడ పాఠాలు బోధించే ఉపాధ్యాయులు మాత్రం ముగ్గురు మాత్రమే ఉన్నారు, ఉపాధ్యాయులు ఒకరు మీటింగ్లో ఇంకొక ఉపాధ్యాయుడు డిప్రెషన్, ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఒక క్లాస్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తుంటే, మిగతా క్లాస్ విద్యార్థులకు, చదువు చెప్పే ఉపాధ్యాయులు లేక విచ్చలవిడిగా విద్యార్థులు ఆడుకుంటూ కనబడ్డారు, పునాది బాగుంటేనే ఇల్లు బాగుంటుంది, అలాంటి విద్యార్థులకు విద్య అంధక విద్యార్థులకు చదువు రాక, ఇబ్బందులకు గురవుతున్నారు, ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడానికి, ముఖ్యంగా ఎక్కువగా వ్యవసాయ కూలీల పిల్లల మాత్రమే ఉన్నారు కాబట్టి, ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య సక్రమంగా అందేల జిల్లా అధికారులు



స్పందించి, ఇక్కడ సరిపడా ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు

# పీఎంఈజీపి రుణాల్లో అవకతవకలపై విచారణ జరపాలని బీజేపీ డిమాండ్



**సత్తుపల్లి , ప్రజాబలం ప్రతినిధి జూలై 27:** ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం పథకం అమలులో అవకతవకలు జరుగుతున్నాయంటూ భారతీయ జనతా పార్టీ నాయకులు సంబంధిత డీసీసీబీ రీజినల్ మేనేజర్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ పథకం ద్వారా నిజమైన నిరుద్యోగ యువతకు కాకుండా ఆర్థికంగా బలమైన వ్యక్తులు, రాజకీయ పలుకుబడి కలిగిన వారు రుణాలు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.

కేవలం సబ్సిడీ పొందడానికే యూనిట్లు ఏర్పాటు చేసినట్లు చూపించి, వాస్తవంగా పరిశ్రమలు లేదా సేవా కేంద్రాలు నిర్వహించకుండా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని తెలిపారు. రుణాల మంజూరులో మధ్యవర్తులు, ప్రభావశీలులు, కొందరు అధికారుల ప్రమేయం ఉండొచ్చన్న ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయని, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే రుణాలు మంజూరవుతున్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

పీఎంఈజీపి పథకం ద్వారా మంజూరైన అన్ని రుణాలపై సమగ్ర విచారణ చేపట్టి, యూనిట్లు వాస్తవంగా ఏర్పాటు చేశారా లేదా అనే అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. తప్పుడు పత్రాలతో లేదా అక్రమ మార్గాల్లో సబ్సిడీ పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అర్హులైన చదువుకున్న నిరుద్యోగ యువతకు పారదర్శకంగా రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే మధ్యవర్తుల జోక్యాన్ని పూర్తిగా అరికట్టి, ప్రజా ధనం నిజమైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ టౌన్ అధ్యక్షుడు బానోతు విజయ్, ప్రధాన కార్యదర్శి మంద శివ, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, డాక్టర్ పెద్దిరాజు, వీరబాబు, కార్తీక్ యాదవ్, అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల ఛేదనలో మరింత కీలకమైన భాద్యతలు నిర్వర్తించాలి పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 28 ప్రజాబలం:**నేరాల గుర్తింపు విషయంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ మరింత సమర్థవంతంగా పని చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. మంగళవారం నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్..నేరాలు, దొంగతనాలు, దోపిడీలు తదితరాలను గుర్తించడంలో దర్యాప్తు అధికారులకు అందిస్తున్న సహాయాన్ని, పాత నేరస్థుల కదలికలకు సంబంధించి ముందస్తు సమాచార సేకరణలో సీసీఎస్ పోలీసుల పనితీరును స్వయంగా పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ... నేరాల ఛేదనలో కీలకంగా వ్యవహరించే సీసీఎస్‌ను పటిష్ఠ పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అంతేకాక ప్రాపర్టీ రికవరీపై సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ రకాలైన నేరాల అదుపునకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు వేగవంతం చేయడానికి క్రైమ్ బృందాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలాని ఆదేశించారు.

## మద్దిలేటి స్వామి హుండీ ఆదాయం రూ 35,86 లక్షలు

బేతంచెర్ల : : బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ మద్దిలేటి స్వామి అమ్మవారి హుండీ ఆదాయం 41రోజులకు రూ. 35. 86. 251లక్షలు,నగదు బంగారం15.గ్రా. 180మి.గ్రా,వెండి800 గ్రా 150 మి.గ్రా.వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్,ఈఓ ఎం.రామాంజనేయులు,తెలిపారు.మంగళవారం జిల్లాదేవాదాయశాఖ అధికారి డి.రమేష్,పర్యవేక్షణలోహుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈఓ తెలిపారు.లెక్కింపులో బాలాజీ సేవ సమితి సభ్యులు,మద్దిలేటి స్వామి సేవ సమితి సభ్యులు,వాసవి సేవ సమితి సభ్యులు,అమ్మవారిశాల సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది,బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# బీఎల్‌ఏలే పార్టీకి బలమైన పునాది

## ఎమ్మెల్యే మట్టా రాగమయి

## సర్ లో సత్తుపల్లి నియోజకవర్గం జిల్లాలో రెండో స్థానం.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 28:** సత్తుపల్లి పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏల సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి కీలక సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ దయద రవీంద్ర, పార్లమెంట్ ఇంచార్జ్ గోపిశెట్టి రాఘవేంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో బీఎల్‌ఏల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఓటర్ల జాబితా నమోదు, సవరణలు, కొత్త ఓటర్ల చేర్పు వంటి అంశాల్లో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.



పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రాజకీయ, పార్టీ కార్యక్రమాల్లో ప్రతి బీఎల్‌ఏ చురుకుగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలు మరియు సత్తుపల్లి, కల్లూరు పట్టణాలకు చెందిన బీఎల్‌ఏలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పీఎంఈజీపి రుణాలు, ప్రీ-ప్రైమరీ నియామకాలపై బీఆర్ఎస్ బాంబు

## 10 కోట్లకుపైగా సబ్సిడీ రుణాల దుర్వినియోగం జరిగిందని ఆరోపణలు

## నియామకాల్లో మెరిట్‌ను పక్కనపెట్టి అక్రమాలు,

## విజిలెన్స్ విచారణకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 28 ప్రజాబలం:** ఖమ్మం జిల్లాలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం రుణాల మంజూరు, ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టుల నియామకాలలో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ రెండు వ్యవహారాలపై తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు.



ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన పీఎంఈజీపి పథకాన్ని జిల్లాలో కొందరు దళారులు, రాజకీయ నాయకులు, బ్యాంకు అధికారులు కుమ్మక్కై దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూనిట్లు స్థాపించకుండానే బినామీ పేరిట రూ.10 కోట్లకుపైగా రుణ సబ్సిడీలు పొందినట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్, జియో ట్యాగింగ్ వంటి నిబంధనలను విస్మరించి రుణాలు మంజూరు చేశారని, నిజమైన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా అభ్యర్థులు రుణాల కోసం తిరుగుతుంటే, పలుకుబడి ఉన్న వారికి సబ్సిడీలు సులభంగా మంజూరయ్యాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరిపి సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టుల నియామకాలలో కూడా ప్రభుత్వం నిర్దేశించిన మెరిట్ విధానాన్ని పక్కనపెట్టి ఇంటర్వ్యూలకు అధిక ప్రాధాన్యం కల్పించారని సండ్ర వెంకట వీరయ్య ఆరోపించారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను విస్మరించి రాజకీయ ఒత్తిళ్లతో నియామకాలు చేపట్టారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా భర్తీ చేసిన 114 పోస్టుల మెరిట్ జాబితా, ఇంటర్వ్యూలలో కేటాయించిన మార్కులు, దరఖాస్తు చేసుకున్న 1,400 మందికి పైగా అభ్యర్థుల వివరాలను బహిరంగపరచాలని ఆయన డిమాండ్ చేశారు.

పీఎంఈజీపి రుణాలు, ప్రీ-ప్రైమరీ నియామకాలపై నిష్పాక్షిక విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆధారాలు సమర్పిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, యలమద్ది రవి, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన గోమాతలకు అంత్యక్రియలు

బేతంచెర్ల : బేతంచెర్ల పట్టణంలోని బైటి పేట,పుల్లమ్మ కలం,రైల్వే గేటు,కాలనీలలోఅనారోగ్యంతో మృతి చెందిన గోమాతలకు నగర పంచాయతీ సిబ్బంది సహకారంతో బేతంచెర్ల యువకులు మరణించిన గోమాతలను ట్రాక్టర్లో తీసుకెళ్లి స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోహిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలోయువకులు తదితరులు పాల్గొన్నారు.

# మారుపాక రైతు వేదికలో విత్తన మేళా

## వరి నాట్లు వేయని రైతులు మెట్ట పంటల సాగు చేయాలి: జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -28** వేములవాడ మండలం మారుపాక రైతు వేదికలో జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ సోమవారం మారుపాకలో విత్తన మేళా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ రోజు వరకు వరి నాట్లు వేయని రైతులందరూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మెట్ట పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కంది, మినుములు, పెసలు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని







తెలిపారు. ఈ పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు రైతు వేదికలో అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తన మేళా ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, విత్తనాల ఎంపిక, సాగు విధానాలపై అధికారులు అవగాహన కల్పించారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విత్తనాలపై వివరాలు తెలుసుకుని కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సాయి కుమార్, మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్, ఏఈఓ దీపిక పాల్గొన్నారు. అలాగే ఏటీఎం ఏ వేములవాడ డివిజన్ చైర్మన్ ముకుంద్ రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రాజు, మారుపాక సర్పంచ్ దొబ్బల మల్లేశం, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థినుల ప్రతిభకు మెరిట్ అవార్డులు

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

## విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 28:** పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థినులను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్ మెరిట్ అవార్డులతో సత్కరించారు. మంగళవారం ఉప్పల్, మల్కాజిగిరిలోని టీఎంఆర్ఈఐఎస్ బాలికల పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా నిర్వహిస్తున్న ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు.





విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకొని క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడి చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు మెరిట్ అవార్డులు అందజేశారు.

ప్రభుత్వం అందిస్తున్న యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ కిట్‌లను 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు పంపిణీ చేశారు.

అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అదనపు కలెక్టర్, భోజన నాణ్యత, మెనూ, వంటశాల పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారం అందించేందుకు నిరంతరం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, శారీరక దృఢత్వం, మానసిక వికాసం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో క్రీడలు కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జి. కాంతమ్మ, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వికాసమే ఉపాధ్యాయుల ఏకైక ధ్యేయం కావాలి

## ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ ఉట్నూరు

ఉట్నూరు, జూలై 28 గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), ఉట్నూరు నిర్వహిస్తున్న "విద్యా జ్యోతి ? సామర్థ్యాభివృద్ధి ఒ సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం" ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం పి.ఎం.ఆర్.సి. మీటింగ్ హాల్, కె.బి. కాంప్లెక్స్, ఉట్నూరులో ప్రాజెక్టు అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, నాణ్యమైన విద్య అందించడమే ప్రతి ఉపాధ్యాయుని ఏకైక ధ్యేయం కావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, మంచి ఉపాధ్యాయులను విద్యార్థులు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాన్ని కేవలం బోధించడం మాత్రమే కాకుండా, పాఠ్య ప్రణాళిక ను లోతుగా అధ్యయనం చేసి, వారాంత ప్రణాళిక ప్రకారం బోధన చేపట్టాలని సూచించారు. తరగతి గదిలో కార్యకలాపాల ఆధారిత బోధన , ఉత్తమ బోధనా పద్ధతులు, వాస్తవ జీవిత ఉదాహరణలను ఉపయోగించి విద్యార్థులకు పాఠ్యాంశాన్ని దృశ్యరూపంలో అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. విద్యార్థుల్లో లక్ష్య నిర్దేశం అలవాటు పెంపొందించి, ఆత్మవిశ్వాసం, జీవిత నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం మరియు సమగ్ర వ్యక్తిత్వ వికాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈఒజ కార్యక్రమమే విద్యకు బలమైన పునాది అని పేర్కొంటూ, ప్రాథమిక స్థాయిలో బలమైన అభ్యాస నైపుణ్యాలు పెంపొందితేనే ఉన్నత తరగతుల్లో మెరుగైన అభ్యాస ఫలితాలు సాధ్యమవుతాయని వివరించారు. ఈ ఐదు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థుల అభ్యాస ఫలితాలు గణనీయంగా మెరుగుపడేలా కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల నుండి వచ్చే విలువైన సూచనలను శాఖ సానుకూలంగా పరిశీలించి, గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అమలుకు అవసరమైన చర్యలు చేపడుతుందని ప్రాజెక్టు అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు చెందిన తెలుగు, ఆంగ్లం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరిష్కార హామీతో ఆందోళన విరమణ
## ఎస్సై తీరుపై గ్రామస్తుల ధర్నా



**జహీరాబాద్, జూలై 28 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానిక ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ వ్యవహార శైలిని నిరసిస్తూ గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఎస్సైకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

ఇంట్లోకి చొరబడి తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసేందుకు వచ్చినా, ఎస్సై తన ఫిర్యాదును స్వీకరించకుండా దురుసుగా ప్రవర్తించారని బాధితుడు శివప్రసాద్ ఆరోపించారు. నిందితులకు మద్దతుగా వ్యవహరిస్తున్న ఎస్సైపై ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో చర్చలు జరిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

## పుల్కల్ మండల రైతులకు ఇబ్బందులు కలగొద్దు
## మంత్రి దామోదర్ రాజనర్సింహ,



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 28 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు నుండి, దిగువన ఉన్న మంజీరాకు వెళ్లే నదిలో రైతులు, మోటార్లు పెట్టి తమ పంటలు పండించుకోవడం జరుగుతుంది,, అయితే సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు త్రాగడానికి మంచినీటి కోసం, రైతుల పంటలకు నీటి సరఫరా చేసే మోటార్లకు, కరెంటు నిలిపివేయలని కలెక్టర్ ఆర్డర్ రావడంతో, విద్యుత్ సిబ్బంది మోటార్లకు కరెంటు సరఫరా నిలిపివేయడం జరిగింది, దీంతో సింగూర్, పోచారం, ముద్దాయిపేట, పుల్కల్, మిన్పూర్, కోదూర్, ఇసోజిపేట, రైతులు నష్టపోతున్నారని, ఆయా గ్రామాల కాంగ్రెస్ రైతులు, మండలంలోని కాంగ్రెస్ నాయకులు, ఈ విషయం మంత్రి దామోదర నరసింహ, దృష్టికి తీసుకు వెళ్లడంతో, మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ తో మాట్లాడి యధావిధిగా విద్యుత్తు, రైతుల మోటార్లకు సరఫరా చేయాలని, విజ్ఞప్తి చేశారు, దీంతో వెనువెంటనే విద్యుత్ సరఫరా మోటార్లకు సరఫరా చేయడం జరిగింది, విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి, రైతులకు న్యాయం చేసిన మంత్రికి రైతులు, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.....

## ఆర్ ఐ అండతో రాజీవ్ గృహకల్ప సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్ స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేసిన భూ కబ్జాదారులు....



కుద్బుల్లాపూర్ ప్రజాబలం జూలై 28: జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్ స్థలం కబ్జా చేసిన ఘటన జగద్గిరిగుట్టలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట గ్రామంలోని సర్వే నంబర్ 348/1 లోని రాజీవ్ గృహకల్ప సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్ కు కేటాయించిన సుమారు ఎకరం స్థలాన్ని భూకబ్జార్లు కబ్జా చేసి చుట్టూ ప్రహరి నిర్మించి అక్రమ నిర్మాణం చేస్తున్న భూ కబ్జాదారులు. అయితే శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో భూకబ్జాదారులకు అవకాశం దొరికినట్లు అయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజీవ్ గృహకల్ప సొసైటీకి 104 బ్లాకులు నిర్మించడానికి 14 ఎకరాల 78 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించగా దానిలో 54 బ్లాక్లు నిర్మించి 1779 నిరుపేద కుటుంబాలకు ఉచితంగా ఇళ్లను కేటాయించారు. వీరికి షాపింగ్ కాంప్లెక్స్ కొరకు స్థలం కేటాయించగా కొందరు లీడర్లు అని చెప్పుకొని బ్రోకర్ గా తయారై ప్రభుత్వ స్థలాన్ని అమ్ముకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడవలసిన మండల అధికారులు ఆర్ఐ దగ్గరుండి స్థలాన్ని కొలిచి ఇచ్చారు అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోని భూకబ్జాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జలసిరి వృద్ధికి కృషి చేద్దాం
## డి ఆర్ డి వో విద్యాచందన




**చంద్రుగొండ, జూలై 28 ప్రజాబలం ప్రతినిధి** :- ప్రభుత్వ పథకాల ద్వారా జలసిరి వృద్ధికి కృషి చేద్దామని డీఆర్డీవో విద్యాచందన కోరారు. మంగళవారం చంద్రుగొండ మండల పరి షత్ కార్యాలయంలో మండల అభివృద్ధిపై సర్పంచ్లు, అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వీబీజీ రామ్ జీ పథకం ద్వారా ఇంట్లో ఇంకుడు గుంత, పంట భూమిలో పంట కుంట, ఊరిలో ఊట కుంట ఏర్పాటే లక్ష్యంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలన్నారు. ఈ పథకంలో రై తుల వ్యవసాయ భూమిలో కుంటలు (ఫారం పాండ్స్) ఏర్పాటుకు రూ. 80 వేల నుంచి 4లక్షల వరకు నూరు శాతం రాయితీతో మంజూరు చేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రతి ఊరులోను ప్రభుత్వ, అటవీ భూముల్లో ఊట కుంటలు తవ్వకానికి రూ 5 లక్షలు, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు రూ. 75 వేలు మంజూరు అవుతాయన్నారు. అదేవిధంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరిసాగు స్థానంలో పెసర, జొన్న, మినుము తదితర పంటలను సాగుచేసే విధంగా రైతులను ఒప్పించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రేమ్కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీరు, పారిశుద్ధ్యం నిర్వాహణతో పాటు గ్రామాభివృద్ధి కార్య క్రమాలు ప్రజాప్రతినిధలు, అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలని అప్పుడే ప్రజలు గుర్తించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. అశోక్, తహశీల్దార్ జగదీశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల లక్ష్యం
### వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే





**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 28:** ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వేములవాడలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు.మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ, పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను తనిఖీ చేసి, పెండింగ్ కేసుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ పరిశుభ్రత, క్రమశిక్షణ పాటించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.విలేజ్ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే వేములవాడకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌ను పెంచి ట్రాఫిక్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. రౌడీ షీటర్లు, గంజాయి, పేకాట, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

అనంతరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, ఎస్ఐలు ప్రేమానందం, శ్రీనివాస్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ రాజు తదితర పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

## సైబర్ మోసాల కట్టడికి డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్



ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అధునాతన సాంకేతికతను ఉపయోగించి, బ్యాంకులు, ఆర్థిక సంస్థలను అప్రమత్తం చేసేందుకు ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com